

హైదరాబాద్ వార్త

# విమోచన సంబురానికి కసరత్తు



ఈనెల 17న నిర్వహించనున్న తెలంగాణ హైదరాబాద్ 78వ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని పెరేడ్ గ్రౌండ్‌లో కళాకారులు రిహార్సల్స్ నిర్వహిస్తున్న దృశ్యం

# మత్తు వదలరా..



పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పాల్సిన బోయిన్‌పల్లి మేధా స్కూల్‌లో ఏకంగా అల్ప్రాజోలమ్ డ్రగ్స్ తయారు చేయడం నగరాన్ని కలవరపాటుకు గురిచేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు స్కూల్ యజమానే అన్న విషయం అటు విద్యార్థి లోకాన్ని, ఇటు తల్లిదండ్రులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇలా విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల సరఫరా చాపకింద నీరులా విస్తరిస్తుండటం, పాఠశాలలు, కళాశాల విద్యార్థులే లక్ష్యంగా గంజాయి, కొకైన్, హాష్ ఆయిల్ ఇలా రకరకాల రూపంలో డ్రగ్స్ సరఫరా అవుతుండటం వంటి పరిణామాలు విద్యార్థుల భవితపై అగాధాల్లోకి నెడుతోంది. పబ్బుల నుంచి విద్యాసంస్థల వరకూ వచ్చిన డ్రగ్స్ భావితరాల భవిష్యత్తుతో ఆడుకుంటున్నాయి.

**యువతపై మాదక ద్రవ్యాల పడగ**

**స్కూళ్లు, కాలేజ్ విద్యార్థులే లక్ష్యంగా డ్రగ్స్ సరఫరా**

**చాక్లెట్లు, సిగరెట్ల రూపంలో విక్రయం**

**విద్యా సంస్థల్లో కనిపించని యాంటీ డ్రగ్ కమిటీలు**

**మేధా స్కూల్ ఘటనతో నివ్వెరపోతున్న విద్యార్థుల తల్లిదండ్రులు**

**పిల్లల్లో లక్షణాలపై అనునిత్యం అప్రమత్తంగా ఉండాలంటున్న మానసిక వైద్య నిపుణులు**

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** పార్టీ ఏదైనా మత్తు ఉండాల్సిందేనంటున్నారు విద్యార్థులు, పార్టీలు, పబ్‌లు, డీజే డ్యాన్స్‌లు.. ఇలా ఎక్కడైనా ఏదో ఒక స్థాయిలో డ్రగ్స్ వినియోగిస్తున్నారు. డ్రగ్ పెడ్లర్లు చాక్లెట్లు, సిగరెట్ల రూపంలో విచ్చలవిడిగా విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నారు. తాజాగా మేధా స్కూల్‌లో అల్ప్రాజోలమ్ డ్రగ్స్ తయారు చేయడం.. ఇటీవల సూరారంలోని మహీంద్రా యూనివర్సిటీలో విద్యార్థులు గంజాయి వినియోగించడం కలకలం రేపిన సంగతి తెలిసిందే. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణ లేకపోవడంతో పాటు తోటివారి ప్రభావంతోనే యువత ఎక్కువగా మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారతున్నారు. ఈ విషవలయంలో ఒక్కసారి చిక్కుకున్న వాళ్లు తిరిగి సాధారణ జీవితం గడపలేకపోతున్నారు. ముఖ్యంగా హైస్కూల్ పిల్లల్లో కొందరిలో ఈ దురలవాటు ఎక్కువగా కనిపిస్తుంది. కరోనా తర్వాతి నుంచి అన్ని వర్గాలలోనూ అలుమ్నీ గ్రూప్‌లు ఎక్కువైపోయాయి. చిన్నా, పెద్ద ప్రతి ఒక్కరూ పూర్వ విద్యార్థుల యూనియన్‌గా ఏర్పడుతున్నారు. ఇల్లు, పాఠశాల ఆవరణలో ఎడిబుల్ చాక్లెట్లను తింటే తల్లిదండ్రులు, టీచర్లు గమనిస్తారని.. బాస్కెట్‌బాల్, స్కేటింగ్ వంటి క్రీడల శిక్షణ సమయంలో పిల్లలు వీటిని వినియోగిస్తున్నారని ఓ పోలీసు ఉన్నతాధికార తెలిపారు. ర్యాపిడో, డుంజో వంటి బైక్ సర్వీస్‌ల ద్వారా బుకింగ్ చేసి తెప్పించుకుంటున్నారని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులైతే పార్టీ మూడ్‌ను మరింత పెంచేందుకు, ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం వినియోగిస్తున్నట్లు పలు కేసుల విచారణలో పోలీసులు గుర్తించారు.

వీకెండ్ వస్తే చాలు యువత స్నేహితులతో కలిసి గంజాయి టూర్లు వేస్తున్నారు. హైదరాబాద్ నుంచి 500-600 కిలో మీటర్లు, ఒక్కో వాహనంపై ఇద్దరేసి చొప్పున ప్రయాణిస్తున్నారు. ప్రధానంగా అరకు, సీలేరు, ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతాలకు వెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పర్యాటక్ ప్రాంతాలు లేదా వాహన రద్దీ తక్కువగా ఉండే నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లి అక్కడే 2-3 రోజులు ఉంటున్నారు. ఉన్నన్ని రోజులు గంజాయి తాగుతూ మరో లోకంలో విహరిస్తున్నారు. తిరుగు ప్రయాణంలో తమ వెంట 2-3 కిలోల గంజాయి, హాష్ ఆయిల్‌ను తీసుకొస్తున్నారు. అడ్డదారుల్లో హైదరాబాద్‌లో విక్రయిస్తున్నారు. కొందరు సొంతంగా వినియోగిస్తున్నారు కూడా.



డ్రగ్స్ ఉత్పత్తి కేంద్రంగా మారిన మేధ హైస్కూల్

విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు యాంటీ డ్రగ్ కమిటీ (ఏడీసీ)లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిబంధనలు విధించింది. కానీ, వాటి నిర్వహణ, అమలుపై పర్యవేక్షణ లేకపోవడంతో నామమాత్రంగానే ఉంటున్నాయి. ఈ కమిటీల్లో అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి కనిష్టంగా ఐదుగురు సభ్యులు ఉంటారు. యువత తన జీవితంలో ఎదురవుతున్న ఎలాంటి పరిణామం, పరిస్థితులనైనా ఎదుర్కొంటూ మాదక ద్రవ్యాల వైపు మొగ్గు చూపకుండా వారిని సిద్ధం చేయడం ఈ కమిటీల ప్రాథమిక విధి. ఏడీసీల అంశంలోనూ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తు తరాలు నిర్వీర్యం కాకుండా ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలకు పాకెట్ మిగతా 2లో

## నెలాఖరు నుంచి రూ.5కే టిఫిన్

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** హైదరాబాద్ వాసులకు రేవంత్ సర్కార్ దసర పండుగ నేపథ్యంలో భారీ శుభవార్త చెప్పడానికి రెడీ అయ్యింది. నగర వాసులు ఎన్నో రోజులుగా ఎదురు చూస్తోన్న రూ.5కే టిఫిన్ అందించే ఇందిరమ్మ క్యాంటీన్లను సెప్టెంబర్ నెలాఖర వరకు ప్రారంభించేందుకు సిద్ధం అవుతోంది. దసరా పండుగ వేళ రూ.5కే టిఫిన్ అందించే ఇందిరమ్మ క్యాంటీన్లు ప్రారంభం కానున్నాయి. నగరంలో పలు ప్రాంతాల్లో ఇప్పటికే వీటికి సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ పథకం ప్రారంభం కానుంది. హైదరాబాద్ నగరంలో నివాసం ఉంటున్న వారికి రేవంత్ సర్కార్ దసరా కానుక ఇచ్చేందుకు రెడీ అవుతోంది. నగర వాసులు చాలా రోజులుగా ఎదురు చూస్తోన్న రూ.5కే మిగతా 2లో





**దసరా నుంచి ప్రారంభమవ్వనున్న ఇందిరమ్మ క్యాంటీన్లు**

**సిఎం చేతుల మీదుగా శ్రీకారానికి ఏర్పాట్లు**

**రోజూ 25వేల మందికి అల్పాహారం**

**60 ప్రాంతాల్లో 150 స్టాల్స్**

**ఆరు రోజులపాటు ఆరు రకాల మెనూ**

**'హరే రామా హరే కృష్ణ'తో నిర్వహణ ఒప్పందం**

## అక్కడ హోంగార్డులే పవర్



**పెద్దసార్లతో పైరవీలు**

**బదిలీ అయినా పక్కపక్కనే చక్కర్లు**

**పాత ఠాణాల్లోనే -మళ్లీ పోస్టింగ్**

**'పశ్చిమం' అంటే అట్టుంటదీ!**

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో గతంలో ఇన్‌స్పెక్టర్ వద్ద విధులు నిర్వహించిన ఒక హోంగార్డు అక్కడ పోస్టు కోసం ఒక పోలీసు విశ్రాంత ఉన్నతాధికారితో పైరవీ చేయించుకొని మరీ దక్కించుకున్నాడు. తరువాతి కాలంలో ఒక పబ్ వ్యవహారంలో ఇన్‌సెక్స్టర్‌తోపాటు సస్పెండ్‌కు గురయ్యాడు.

- పశ్చిమ మండలంలో పనిచేసే దాదాపు ముగ్గురు, నలుగురు హోంగార్డులు పశ్చిమ మండలంలోని ఠాణాల పరిధిలోనే చక్కర్లు కొడుతున్నారు. ఒక హోంగార్డు ఏకంగా మరో హోంగార్డుకు డబ్బులిచ్చి మ్యూచ్‌వల్ కింద తనకు కావాల్సిన ఠాణాకు మారాడు.
- సంపన్నుల ప్రాంతంలోని ఠాణాలో ఉన్న హోంగార్డు ఇన్‌స్పెక్టర్‌తో అంటకాగడమే కాకుండా బదిలీ అయినప్పటికి మరో ఉన్నతాధికారి పైరవీతో తన స్థానాన్ని పదిలపర్చుకున్నాడు. వీరే కాదు..

పశ్చిమ మండల ప్రాంతంలో శాంతిభద్రతల విభాగంతోపాటు టాస్క్‌ఫోర్స్ లో ఉన్న కొందరు హోం గార్డులు, కానిస్టేబుళ్లు పశ్చిమ మండలాన్ని వదిలి వెళ్లలేకపోతున్నారు. పశ్చిమ మండల పరిధిలో ఉన్న ఠాణాల్లోనే తిష్ట వేసేందుకు తమకు తెలిసిన ఉన్నతాధికారులతో పైరవీలు చేయించుకొని మరి ఉంటున్నారు. కొద్ది నెలల పశ్చిమ మండల పరిధిలో దాదాపు 35 మంది హోంగార్డులను పోలీసు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఇలా బదిలీ చేసిన వారిలో ఎక్కువ మంది దాదాపు రెండు, మూడేళ్లకుపైగా ఆయా ఠాణాల్లో ఉన్నవారే. హోంగార్డులను బదిలీ చేయడమే కాకుండా వారికి కేటాయించిన స్థానాల్లోకి వెంటనే వెళ్లిపోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. కాని వారిలో ఎక్కువ మంది బదిలీలను నిలుపుదల చేయించుకొని పాత ఠాణాల్లోనే కొనసాగుతున్నారు. మాకంటే హోంగార్డులే పవర్‌ఫుల్.. పైరవీ చేయించుకొని ఏళ్లుగా ఇదే ఠాణాలో ఉంటున్నారని ఒక ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి వ్యాఖ్యానించడం గమనార్హం.

**గాడ్‌ఫాదర్‌ల నీడలో..**

కొందరు హోంగార్డులకు విశ్రాంత ఉన్నతాధికారులే కాకుండా ప్రస్తుతం కొలువులో ఉన్న ఉన్నతాధికారులు సైతం గాడ్‌ఫాదర్లుగా ఉన్నారు. దీంతో కొందరు హోంగార్డులు ఏకంగా ఏడేళ్ల నుంచి పదేళ్లకు పైగా ఇక్కడే ఉంటున్నారు. బదిలీ అయిన మరుక్షణమే బదిలీ అయిన సిబ్బంది ఈ గాడ్‌ఫాదర్లను ఆశ్రయిస్తుండటంతో వారు రంగంలోకి దిగి బదిలీ నుంచి కాపాడుతున్నారు. ఒక ఏఎస్సై దాదాపు పదేళ్లకు పైగా కానిస్టేబుల్‌గా ఉన్న నాటి నుంచి లా అండ్ ఆర్డర్‌తోపాటు టాస్క్‌ఫోర్స్‌లో తిరిగి అటాచ్డ్ రూపంలో మళ్లీ పశ్చిమ ఠాణాలోనే తిష్టవేశాడు. గతంలో అతను కలెక్టర్‌గా పనిచేసిన అనుభవంతో ఇక్కడే దక్కించుకున్నాడు. మరో హోంగార్డు దాదాపు పదిహేనేళ్లపాటు విధులు నిర్వహించిన ప్రాంతం నుంచి ఎట్టకేలకు బదిలీ చేయగా వారం రోజుల్లోనే తిరిగి అదే ఠాణా పరిధిలో ఇంటర్‌సెప్టార్ వాహనంలో సిబ్బందిగా వచ్చి చేరాడు. మరో ఇద్దరు హోంగార్డులు మిగతా 2లో

## మళ్లీ మింగేసిందా?

**వినోబానగర్, ఆసిఫ్‌నగర్ ఏరియాల్లో నాలాలో పడి ముగ్గురు గల్లంతు**

**కొనసాగుతున్న గాలింపు చర్యలు**

**నాలాలపై ఆక్రమణలు తొలగిస్తున్నాం**

**హైడ్రా కమిషనర్ రంగనాథ్**

**ముషీరాబాద్, బేగంబజార్ సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** ముషీరాబాద్‌లో వర్షాల కారణంగా వరద నీరు పోటెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుం టామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హామీ ఇచ్చారు. సోమవారం ఆయన ముషీరాబాద్ లోని వినోబానగర్‌లో ఆదివారం రాత్రి వరద నీటిలో దినేష్ (సన్నీ) కొట్టుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన అక్కడ పరిస్థితులపై స్థానిక బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వర్షాకాలంకు ముందే నాలాను ఆధునీకరణ చేసి, నాలా పూడికతీత తీసేవాళ్లమని, దీనివల్ల వరద నీరు నాలా ద్వారా సాఫీగా వెళ్లిపోయేదని తెలిపారు. ఈ మధ్య కాలంలో నాలాను ఆధునీకరించకపోవటం వల్ల వరద నీరు ఇళ్లల్లోకి వచ్చి, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారని అన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ రంగనాథ్ నాలాను ఆక్రమించి కట్టిన వ్యాపార సముదాయాలను తొలగించి, నాలాను వెడల్పు చేస్తామని స్పష్టం చేశారు. పేదల ఇళ్లను కూల్చమని, కమర్షియల్ నిర్మాణాలను మాత్రం వదిలిపెట్టేది లేదని తెలిపారు. గతంలో 15 ఫీట్ల లోతు ఉండే నాలా ఇప్పుడు 5 ఫీట్ల లోతుకూడా లేకపోవటం వల్ల వరద సమస్య ఎక్కువగా ఉందని, వీటిపై జీహెచ్‌ఎంసీ అధికారులతో చర్చించి, తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పోరేటర్ ఎం.సుప్రియానవీన్‌గౌడ్, బీఆర్ఎస్ నేతలు ముఠా జైసింహ, ఎడ్ల హరిబాబుయాదవ్, కొండా శ్రీధర్‌రెడ్డి, దీన్‌దయాళ్‌రెడ్డి, బీజేపీ ముషీరాబాద్ నాయకులు ఎం.నవీన్‌కుమార్‌గౌడ్, కంచి ముదిరాజ్, సీపీఎం నాయకులు ఎం.దశరథ్ తదితరులు పాల్గొన్నారు.



వినోబా నగర్‌లో సమీక్షిస్తున్న హైడ్రా కమీషనర్ రంగనాథ్

**విషాదంలో వినోబానగర్**

ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వరద నీరు పోటెత్త టంతో దినేష్ (24) అనే వ్యక్తి బైకుతో సహా కొట్టుకుపోయాడు. కొద్ది దూరంలో బైకు కనిపించినప్పటికీ, దినేష్ జాడ తెలియలేదు. ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేసే దినేష్‌కు తల్లి తండ్రులతో పాటు భార్య, రెండు సంవత్సరాల కుమారుడు ఉన్నారు. దినేష్ జాడ మిగతా 2లో



నాలాను పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్

## ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్లో బీభత్సం

**- కుర్చీలు ధ్వంసం - ఆరుగురు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు**

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** ఒక కేసు విషయంలో నిందితుడి తరుపు కుటుంబ సభ్యులు, బంధువులు ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి నానాభీభత్సం సృష్టించిన సంఘటన ఇది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 14లోని నందినగర్ ప్రాంతంలో నివసించే ఆటో డ్రైవర్ గుగులోతు శ్రీను ఆదివారం మధ్యాహ్నం బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లోని లోటస్ పాండ్ ప్రాంతంలో ఆటోలో రాంగ్‌రూట్‌లో వెళ్తున్నాడు. అదే సమయంలో అటుగా వచ్చిన ఒక కారుకు ఆటో ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న శ్రీధర్‌రెడ్డి 100 డయల్ చేయడంతో ఫిల్మ్‌నగర్ ప్పోలీసులు అక్కడికి చేరుకున్నారు. శ్రీనునాయక్‌ను ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న శ్రీను నాయక్ తండ్రి భద్రునాయక్ ఠాణాకు వచ్చి గొడవ చేయడంతో పోలీసులు జరిగిన విషయం తెలియజేసి అక్కడి నుంచి పంపించారు. ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం భద్రునాయక్‌తోపాటు అతని బంధువులు, స్నేహితులైన బానోతు నవీన్, గణేష్, నాగేంద్ర, రడియా నాయక్, ప్రసాంత్, అరవింద్ తదిరులతో కలిసి ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. రిసెప్షన్‌లో ఉన్న సిబ్బందితో గొడవకు దిగడమే కాకుండా అక్కడున్న కుర్చీలను ధ్వంసం చేశారు. పోలీసు విధులను ఆటంకించడమే కాకుండా నానా హంగామా చేశారు. దీంతో పోలీసులు వారందరిపై కేసులు నమోదు చేశారు. నిందితులందరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఫిల్మ్‌నగర్ పోలీసులు తెలిపారు.









## రీయంబర్స్‌మంటలు

**విద్యార్థులకు ఫీజులు, స్కాలర్‌షిప్‌లు పెంచాలని నిరసన ప్రదర్శన**

**సైఫాబాద్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** విద్యార్థుల ఫీజుల రీయంబర్స్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిజాం కళాశాలకు చెందిన అనేక మంది విద్యార్థులు సోమవారం ప్రదర్శన నిర్వహించారు. ఎబివిపి గోల్కొండ జిలా కన్వీనర్ విక్రమాదిత్య ఆధ్వర్యంలో విద్యార్థులు నిజాం కళాశాల నుంచి బషీర్‌బాగ్‌లోని డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు ప్లకార్డులు చేబూని ప్రదర్శన నిర్వహించారు.

## నాలాలకు ఫెన్సింగ్

**వేగంగా పూడికతీత పనులు**

**జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** మల్లేపల్లి నాలాలో పూడికతీత, పరిశుభ్రత పనులను చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇంజనీరింగ్ అధి కారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమ వారం మెహదీపట్నం సర్కిల్ పరిధిలోని మల్లేపల్లి నాలాను ఖైరతాబాద్ జోనల్ కమి షనర్ అనురాగ్ జయంతితో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలాలో పేరుకుపోయిన మట్టిని తొలగించే చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. తద్వారా భారీ వర్షాల సమయంలో నాలా సమీప ప్రాంతాల్లో నీటి నిల్వలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. మిగతా 2లో

## చిన్నారులకు విజయవంతంగా గుండె ఆపరేషన్‌లు

**హైదరాబాద్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** చిన్నారుల గుండె ఆపరేషన్ల కోసం నిమ్స్ వైద్యులు చేస్తున్న కృషి అభినందనీయమని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ అన్నారు. నిమ్స్‌లో ప్రముఖ బ్రిటన్ వైద్యులు డాక్టర్ దన్నపనేని రమణ, నిమ్స్ కార్డియో థోరాసిక్ విభాగాధిపతి డాక్టర్ అమరేశ్వరరావు సారథ్యంలో చిన్నారులకు గుండె ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన సోమవారం నిమ్స్ మిలినియమ్ బ్లాక్‌లోని మిగతా 2లో



నిమ్స్‌లో అపరేషన్ వార్డును పరిశీలిస్తున్న బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్

### 17న బేగంపేట విమానాశ్రయంలో ప్రయాణీకుల సేవా దినోత్సవం

**బేగంపేట సెప్టెంబరు 15,ప్రభాతవార్త**

హైదరాబాద్ లోని బేగంపేట విమానాశ్రయంలో 2025 సెప్టెంబరు 17న ప్రయాణీకుల సేవా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు విమానాశ్రయ జనరల్ మేనేజర్ కో ఆర్డినేషన్ ఇంచార్జి అచింత్ కుమార్ దత్ తెలియజేసారు.ప్రయాణీకుల అనుభూతిని మెరుగు పర్చేందుకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు.అమ్మ పేరుతో ఒక మొక్క చెట్ల పెంపకం కార్యక్రమం పర్యావరణ అవగాహన పెంచుతుంది. పిల్లల కోసం పెయింటింగ్ పోటీ నిర్వహించబడుతుందన్నారు.పౌర విమానయాన రంగంలో అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలపై విధ్యార్థులకు అవగాహన కల్పించేందుకు రక్తదాన శిబిరం మరియూ ఇంటరాక్టివ్ సెషన్‌లు నిర్వహించబడతాయన్నారు.ఈ కార్యక్రమం ప్రయాణీకుల సౌలభ్యం మరియూ సంతృప్తి పట్ల మా నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.విమానాశ్రయం ప్రయాణీకులకు ఉత్తమ సౌకర్యాలను అందించాలని తాము కోరుకుంటున్నట్లు అచింత్ కుమార్ దత్ తెలియజేసారు.

### జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌కు నూతన పాలవర్గం

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 15, ప్రభాతవార్తః**

జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్(జూబ్లీహిల్స్ క్లబ్–జేఐసీ)కు నూతన పాలకవర్గం ఎన్నికైంది. ఇక్కడ జరిగిన ఎన్నికల్లో భాగంగా అధ్యక్షుడిగా డాక్టర్ సీహెచ్ వసంత్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా టి. ప్రద్యుమ్న కుమార్ రెడ్డి, కార్యదర్శిగా సీహెచ్ జగ్గారావు, సంయుక్త కార్యదర్శిగా ఎం. జనార్ధన్‌రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ ఎస్వీ రవీంద్రనాథ్, అట్లూరి సుబ్బారావు, డాక్టర్ కె. జ్యోతిప్రసాద్, ఎం. ప్రభాకర్‌రావు, పోతినేని కోటేశ్వరరావు, విద్యాసాగర్, బీఎస్సీ ప్రకాశ్‌రావు, డీవీ శివ ప్రసాద్, ఎస్. శివప్రసాద్, బి. రాజశేఖర్, ఎ. సురేష్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. నామినేషన్లకు, స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియడంతోపాటు ఆయా పోస్టులకు కేవలం ఒక్కో దరఖాస్తే వచ్చాయి. దీంతో వీరంతా ఎన్నికైనట్లు 2025–27 సంవత్సరానికి ఈ నూతన పాలకవర్గం ఎన్నికైనట్లు సహాయ రిటర్నింగ్ అధికారి కొల్లి రమేష్ చౌదరి ప్రకటించారు.

### నేడు, రేపు పార్క్‌హయత్‌లో పోల్కి ఆభరణాల ప్రదర్శన

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 15, ప్రభాతవార్తః**

బంజారాహిల్స్‌లోని పార్క్‌హయత్‌లో ఈ నెల 16, 17 తేదీల్లో పోల్కి, జువెలరీ ప్రదర్శనను నిర్వహించనున్నట్లు ఎంబి సన్స్ అభిషేక్ సోని, గౌతం సోని తెలిపారు. ఇందుకు సంబంధించిన సన్నాహక సమావేశం సోమవారం ఒక హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మోడల్స్ విభిన్న రీతిలో రూపొందించిన పోల్కి ఆభరణాలతో ఇక్కడ తళుక్కున మెరిశారు. ఆయా ఆభరణాల రీతులను ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాజవంశాల వారసత్వంతో కూడిన అరుదైన, సంప్రదాయ ప్రదర్శనను ఇక్కడ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. సహజసిద్ధమైన వజ్రాలతో రూపొందించిన ఆభరణాలను ప్రదర్శనలో ఏర్పాటుచేస్తున్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న మాస్టర్ పీస్‌లను సైతం ఇక్కడ ప్రదర్శిస్తామన్నారు.

### కనులకింపుగా నృత్యార్పణం-ఎ డివైన్ ఆఫరింగ్



కళాకారుల నృత్యార్పణంలో ఒక దృశ్యం

**నాంపల్లి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** నృత్యదీక్షాలయ ది గేట్‌వే ఆఫ్ కూచిపూడి ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకురాలు, ఆర్టిస్టిక్ డైరెక్టర్ లక్ష్మీశంకర్ నేతృత్వంలో బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్ కళావేదికలో సంస్థ శిష్యబృందంచే నృత్యార్పణం–ఎ డివైన్ ఆఫరింగ్ కనులవిందుగా నిర్వహింపబడింది. కళాకారులు ముందుగా రంగ పూజతో ప్రారంభించి గణేశకౌత్వం, జగదానందకారక, జతిస్వరం, కామాక్షి నవావరణకృతి శంకరి, కొలువైతివా రంగసాయి, శ్రీష పద్మనాభ, అష్టలక్ష్మి తదితర నృత్యాంశాలను అద్భుతంగా నర్తించి రామచంద్రాయ మంగళంతో నృత్యార్పణ ముగించారు. ప్రతీ అంశ ప్రదర్శనలో క్రమశిక్షణతోపాటు భక్తిరసం, కూచిపూడి శాశ్వత సౌందర్యం వెల్లివిరిశాయి.ఎస్‌వికెవిపి.దీక్షితులు నట్టువాంగం, డిఎస్‌వి.శాస్త్రి గాత్రం, రాజగోపాలాచారి మృదంగం, ఆర్.దినకర్ వయోలిన్, విబి ఎస్.మురళి వేణువు, కె.శశిధర్ వీణ, కె.జయకుమారాచార్య ఎఫెక్ట్స్‌తో ప్రత్యక్ష వాద్య సహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు.

### వరదల్లో నిరాశ్రయులైన పేదలను ఆదుకోవాలి



వృద్ధ మహిళలకు ఉచితంగా చీరెలు పంపిణీ చేస్తున్న శ్రీకాంత్‌శర్మ

**సైఫాబాద్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** దేశంలోని ఆనేక ప్రాంతాలలో, తెలుగు రాష్ట్రాలలో, హైదరాబాద్ నగరంలో కురిసిన వర్షాల వల్ల ఆనేక మంది నిరాశ్రయులైనారని, వారిని కాపాడి అదుకోవాల్సిన బాధ్యత సమాజంపైన ఉందని శ్రీకర సత్య సేవా సహకార సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది నూతి శ్రీకర్‌శర్మ చెప్పారు. ప్రతి ఒక్కరూ బాధితులకు తమ వంతు సహాయం అందించి అదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం నాడిక్కడ సమాఖ్య ఆధ్వర్యంలో తుములురు దేవసేనమ్మ జ్ఞాపకార్థం వృద్దులైన మహిళలకు ఉచితంగా చీరెలు పంపిణీ చేసిన సందర్బంగా ఆయన మాట్లాడారు. ప్రకృతి వైపరిత్యాల వల్ల సర్వం కోల్పోయిన బాధితులను కే ంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు స్వచ్చంద సంస్థలు కూడా అదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు మనిగండ్ల శ్రీనివాస్‌గుప్తా, కల్పన తదితరులు పాల్గొన్నారు.

### గురువులేనిదే ఏ విద్యా లేదు : సముద్రాల వేణుగోపాలాచారి



గురువులను సన్మానిస్తున్న వేణుగోపాలాచారి, రమణారావు, లలితారావు, దైవజ్ఞశర్మ తదితర అతిథులు

**రవీంద్రభారతి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** ఈ సృష్టిలో గురువులేని ఏ ప్రక్రియ, విద్యా అనేది ఉండదని, పెద్దలన్నట్లు గురువులేని విద్య కుంటివిద్యని కేంద్ర మాజీమంత్రి డా. సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. తల్లిదండ్రుల తర్వాత మనకు విద్యను నేర్పేది గురువేనని, అందుకే గురుదేవోభవంటూ గురువుకు దేవుని స్థానమిచ్చామని తెలిపారు. ప్రతిఒక్కరూ తమ గురువులను గౌవించడం, పూజించడం మన సంప్రదాయమన్నారు. ఈనాటి గురువందనం కార్యక్రమంలో వందలాదిమంది శిష్యులకు కళను నేర్పించిన గురువులను సత్కరించుకోవడం హర్షదాయకమన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని గ్లోబల్ ఈవెంట్స్, జైజవాన్ జైకిసాన్ జైకళాకార్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో నిర్వహించిన గురువందనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. సముద్రాల వేణుగోపాలాచారి విశిష్ట అతిథులు చకిలం సుధాకర్, శ్రీకావ్య, నాహంత్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్ష కార్యదర్శులు డా. లయన్ కె.వి.రమణారావు, లలితారావు, దైవజ్ఞశర్మ తదితరులతో కలిసి 12మంది ప్రముఖ గురువులకు ఘనంగా గురువందనం కావించారు. ఈనాటి సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రదర్శనలిచ్చిన వారి శిష్యులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి ఎంతగానో అభినందించారు.

## తెలంగాణ ప్రెస్ అకాడమీకి షోయబుల్లాఖాన్ పేరు పెట్టాలి

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త**



షోయబుల్లాఖాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి స్టాలిన్

త్యాగాల చరిత్ర కలిగిన షోయబుల్లాఖాన్ పేరును తెలంగాణ ప్రెస్ అకాడమీకి పెట్టి సముచితంగా గౌరవించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి స్టాలిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా సోమవారం కాచిగూడలో భారత కమ్యూనిస్టు పార్టీ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షతన షోయబుల్లాఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి స్టాలిన్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దొరలు పటేల్, పట్వారిలు భూస్వామ్యాన్ని కూకటి వేళ్ళ తో పికిలించాలని జరుగుతున్న పోరాటాన్ని ప్రతిబింబిస్తూ షోయబుల్లాఖాన్ తాజ్వీ పత్రికలో వ్యాసాలు ప్రచురించడం జరిగిందన్నారు. ఈ పత్రికపై నిజాం సర్కార్ కత్తిగట్టి నిషేధం విధించినా,ముస్లిం మేధావులను సమీకరించి వారి అభిప్రాయాలను ముద్రించటం జరిగిందన్నారు. సర్కార్ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పౌర ప్రజాస్వామిక హక్కులు లేకుండా పత్వాలు జారీ చేస్తున్న పాలనపై తన రచనల ద్వారా కలానికి పదును పెట్టి ప్రజలను చైతన్యం చేయడం జరిగిందన్నారు. ఇది నచ్చని నిజాం సర్కార్ షోయబుల్లాఖాన్‌ను బెదిరింపులకు గురి చేయడమే కాకుండా హత్య చేస్తామని చెప్పడం జరిగిందని తెలిపారు. బెదరకుండా , నిండు గర్భవతిగా ఉన్న తన భార్య గురించి ఏమాత్రం ఆలోచన చేయకుండా అత్యంత ధైర్యంగా నిజాంపై వార్తలు ప్రచురించారని, పత్రిక పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న షోయబుల్లాఖాన్ ను రజాకార్లు అత్యంత దారుణంగా కాచిగూడలో తన రెండు చేతులను నరికి దారుణంగా హత్య చేయడం జరిగిందన్నారు. ఇట్లాంటి త్యాగాల చరిత్ర కలిగిన షోయబుల్లాఖాన్ పేరును తెలంగాణకి ప్రెస్ అకాడమీ కి పెట్టి సముచితంగా గౌరవించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గదని పేర్కొన్నారు.సిపిఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చంద్రమోహన్ గౌడ్ మాట్లాడుతూ నిజాం రాచరిక పాలన పై కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటం ద్వారా తిరుగుబాటు చేసి ఓడించడం జరిగిందని చెప్పారు. ఇట్లాంటి మహత్తరమైన చరిత్రను వక్రీకరిస్తూ బిజెపి దీనికి మతముసుగును జోడించి తప్పుడు చరిత్రను ప్రజల్లోకి తీసుకుపోయే ప్రతి ప్రయత్నాన్ని కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలుగా ఎదిరించి వాస్తవ చరిత్రను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. దొరల భూస్వాముల దౌర్జన్యాలు సహించలేని ప్రజలు ధైర్యసహసాలతో ఉద్యమాలు నిర్వహించారు. ఈ విషయాన్ని అమరవీరుల చరిత్రను పాఠ్యాంశాలు చేర్చి నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉన్నదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు కాంపల్లి శ్రీనివాస్, మహమ్మద్ సలీం, కౌన్సిల్ సభ్యులు ఆరుట్ల రాజ్ కుమార్, జంగయ్య, కళ్యాణ్ ,అనిల్, ధరంపురి,గణేష్, ఐలయ్య, ఫహీం, సుశాంత్,అరుణ్, భాను,అరవింద్,చింటూ తదితరులు పాల్గొన్నారు.

## బండ్లగూడ కార్పొరేషన్‌ను రాజధానికి ధీటుగా అభివృద్ధి చేస్తున్నాం: ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**- రూ.8.కోట్ల 82.లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**



బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో రూ.8.కోట్ల 82.లక్షల అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

**నార్సింగి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌ను రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరంకు ధీటుగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం కార్పోరేషన్ పరిధిలోని 1,7,8,10,14,18.డివిజన్ల పరిధుల్లో రూ.8.కోట్ల 82.లక్షల 80.వేల రూపాయలతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజి, సీసీ రోడ్ల పనులకు కమీషనర్ శరత్ చంద్రతో కలిసి ఎమ్మెల్యే శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని చేతలలో చేసి చూపిస్తున్నామన్నారు. ముఖ్యంగా మౌళిక వసతులైన తాగునీరు, భూగర్భ డ్రైనేజి వ్యవస్థ, వీధి దీపాలు, సీసీ రోడ్లు, పార్కులు, ఓపెన్‌జిమ్‌లు, కమ్యూనిటీ హాళ్లు, స్మశాన వాటికలు, అదనపు తరగతి గదులు ఇలా అనేక అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతూ వస్తున్నామన్నారు. శాశ్వతంగా సమస్యలను పరిష్కరిస్తున్నామని వివరించారు. ప్రజలు ఏ సమస్యలున్నా నేరుగా మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్, ఇతర అధికారులను కలిసి విన్నవించుకోవాలని, అవసరమైతే నన్ను కలువవచ్చని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. అధికారులైనా, ప్రజా ప్రతినిధులైనా ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే పని చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హైదర్షాకోట్ సహకార సంఘం ఛైర్మన్ రాందాస్ ముదిరాజ్, మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ పి.రాజేందర్‌రెడ్డి, మాజీ కార్పోరేటర్లు సాగర్‌గౌడ్, శ్రీలత సురేష్‌గౌడ్, శ్రీనాథ్‌రెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ టి.ప్రేమ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పి.కృష్ణారెడ్డి, ఖాజా, సంగారెడ్డి, రత్నం. బి.శ్రీనివాస్, సుమన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నెలాఖరు నుంచి రూ.5 కే టిఫిన్

(మొదటి పేజీ తరువాయి)

టిఫిన్ అందించే ఇందిరమ్మ క్యాంటీన్లను దసరా పండుగ సందర్భంగా ప్రారంభించనున్నారు. ఇప్పటికే నగరంలో పలు ప్రాంతాల్లో ఇందిరమ్మ క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. సెప్టెంబర్ నెలాఖరు లేదా దసరా పండుగ నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీటిని ప్రారంభిచనున్నట్లు అధికారులు తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం.. పేదలు, సామాన్యుల ఆకలి తీర్చడం కోసం ఇందిరమ్మ క్యాంటీన్లు తీసుకువచ్చేందుకు రెడీ అయిన సంగతి తెలిసిందే. వీటిల్లో రూ.5కే టిఫిన్ అందించనున్నారు. ఈ క్యాంటీన్లు రోజువారి కూలీలు, నిరుద్యోగులు, విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉండనున్నాయి. ఈ పథకం ప్రారంభం కోసం నగర వాసులు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. వాస్తవానికి ఆగస్టు 15 నాడే వీటిని ప్రారంభిస్తారని భావించారు. కానీ అప్పుడు సాధ్యం కాలేదు. ఈక్రమంలో దసరా పండుగ సందర్భంగా సెప్టెంబర్ నెలాఖరు నాటికి ఇందిరమ్మ క్యాంటీన్లను ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీటిని ప్రారంభించనున్నారు. ఇప్పటికే నగరంలో ఉన్న జీహెచ్‌ఎంసీ స్టాళ్లలో మధ్యాహ్నం రూ.5కే భోజనం అందిస్తున్న సంగతి తెలిసిందే. ఇకపై వీటిల్లో వారంలో ఆరు రోజులు.. ప్రతి రోజు ఉదయం టిఫిన్లు కూడా అందించనున్నారు. ఇక నగరంలో 139 స్టాల్స్ ఉండగా.. వీటి సంఖ్యను ఇప్పుడు 150కి పెంచారు. ప్రస్తుతం నగరం మొత్తం మీద 60 ప్రాంతాల్లో స్టాల్స్ అందుబాటులో ఉన్నాయి. గతంలో ఉన్న స్టాల్స్‌తో పోల్చితే.. కొత్తవి మూడింతల వెడల్పుతో చాలా విశాలంగా ఉన్నాయి. వీటి కోసం ప్రభుత్వం రూ.11.43 కోట్లు ఖర్చు చేసింది. ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను పాటిస్తూనే.. పేదలకు రూ.5కే నాణ్యమైన, రుచికరమైన టిఫిన్ అందిస్తామని అధకారులు తెలిపారు. ఇందిరమ్మ క్యాంటీన్ల ద్వారా రోజూ 25వేల మందికి టిఫిన్ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ఆరు రోజులకు ఆరు రకాల టిఫిన్స్ మెనూ సిద్ధం చేసింది బల్దియా. ఇడ్లీ, పొంగల్, పూరి, ఉప్మా వంటి అల్పాహారాలతో పాటుగా మిల్లెట్ టిఫిన్స్ కూడా అందించనున్నారు. ప్రస్తుతం నగరంలో జీహెచ్‌ఎంసీ తరఫున నగరవాసులకు మధ్యాహ్నం రూ.5కే భోజనం అందిస్తున్న సంగతి తెలిసిందే. హరే రామ హరే కృష్ణ మూవ్ మెంట్ సహకారంతో బల్దియా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా.. ఐదు రూపాయల టిఫిన్ కార్యక్రమం బాధ్యతలను కూడా దీనికి అప్పగిస్తూ బల్దియా హరే రామా హరే కృష్ణ మూవ్ మెంట్‌తో ఒప్పందం చేసుకుంది. ఇందిరమ్మ క్యాంటీన్లు త్వరగా అందుబాటులోకి వస్తే బాగుంటుందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు.

## ఆరోగ్య మహిళా కార్యక్రమం విజయవంతం చేయాలి

**-ప్రణాళికా ప్రకారం క్యాంపుల నిర్వాహణ చేపట్టాలి**
**-జిల్లా వైద్యాధికారులకు కలెక్టర్ హరిచందన దాసరి ఆదేశం**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 15,ప్రభాతవార్త:**
జిల్లాలో ఈనెల 17 నుండి అక్టోబర్ 2వరకు నిర్వహించే ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబ కార్యక్రమం ( స్వస్థ్ నారీ శక్త్ పరివార్ అభియాన్ ) కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ ద్వారకానాథ్ రెడ్డి, సెక్రెటరీ డాక్టర్ అశోక్ కుమార్ లతో కలసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్యాంపుల నిర్వహణ షెడ్యూల్‌ను సిద్ధం చేసి ప్రణాళిక ప్రకారం ప్రతిరోజు ఒక స్పెషాలిటీ క్యాంపు అలాగే ఒక మెగా క్యాంపు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా ఈ క్యాంపుల నిర్వహణలో 14 రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందాలని వారి భాగస్వామ్యంతో కలిసి పని చేయాలని సూచించారు. 12 రోజులు ప్రతి యుపిహెచ్ సి లలో స్పెషలిస్ట్ క్యాంపులు నిర్వహించాలని అందులో గైనకాలజీ సర్వీసెస్, పిరియాట్రిక్ సర్వీసెస్, ఈ ఎన్ టి, డెంటల్, టి. బి, డెర్మటాలజీ, న్యూట్రిషన్, సైక్రో యాట్రిస్ట్, అప్తాలమిక్ తదితర వైద్య సేవలు అందాలని ఆమె సూచించారు. 17న అమీర్‌పేట్‌లో మంత్రుల చేతుల మీదుగా క్యాంప్ ప్రారంభించటం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్ హెచ్ ఓ డాక్టర్ వెంకటి, డిటిసి ఓ డాక్టర్ చల్లా దేవి, ఇంచార్జ్ డిసిహెచ్ ఎస్ శ్రీనివాసరావు, గాంధీ ఆసుపత్రి, ఉస్మానియా ఆసుపత్రి, సరోజినీ దేవి కంటి ఆసుపత్రి సూపరిండెంట్లు , ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమ అధికారులు, వివిధ విభాగాల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 18 నుంచి 23వరకు నర్సరీ మేళా

**హైదరాబాద్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:**



నెక్లెస్ రోడ్‌లో జరిగే గ్రాండ్ నర్సరీమేళా బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,చిత్రంలో మేళా ఇంచార్జీ ఖలీద్ అహ్మద్ తదితరులు

పట్టణ ప్రాంతాల్లో గ్రీనరీ అవసరమని, మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు తన వంతు కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో 18వ గ్రాండ్ నర్సరీ మేళా పేరుతో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా హార్టీకల్చర్, అగ్రికల్చర్ షో బ్రోచర్‌ను మంత్రి ఆవిష్కరించారు. నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజాలో ఈనెల 18 నుంచి 22 తేదీ వరకు 5 రోజుల పాటు నర్సరీ మేళా ప్రదర్శన ఉంటుందన్నారు.ఈ సందర్బంగా నర్సరీ మేళా ఇంచార్జీ ఖలీద్ అహ్మద్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి అగ్రికల్చర్, హార్టీకల్చర్ ఉత్పత్తులతో ఆల్ ఇండియా హార్టీకల్చర్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెర్రస్ గార్డెనింగ్, వర్టికల్ గార్డెనింగ్, హైడ్రోఫోనిక్ సిస్టమ్ వంటి కొత్త పద్ధతులను ఈ షోలో ప్రదర్శిస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా అందుబాటులో ఉంటుందన్నారు. దేశవ్యాప్తంగా ఏపీ, కోల్‌కతా, ఢిల్లీ, హర్యానా, ముంబై, బెంగళూరు, పుణె, షిర్డీ, కడియం, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ప్లాంట్స్‌తో 150 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మెడిసినల్, కిచెన్, అవుట్ డోర్, బల్బ్స్, సీడ్, సీడ్ లింక్స్, ఇండోర్, ఆడినియం, బోన్సాయ్, క్రీపర్స్, ఫ్లవర్స్, ఇంపోర్టెడ్ ప్లాంట్స్ ప్రదర్శిస్తామని ఖాలీద్ అహ్మద్ వివరించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, హార్టీకల్చర్ డైరెక్టర్ యాస్మిన్ భాషా ఈ మేళా ప్రారంభిస్తారని తెలిపారు.

## డిమాండ్ల సాధనకు కమిషనర్ కార్యాలయం ఎదుట ఎఎన్‌ఎంలు ధర్నా



కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎఎన్‌ఎంలు. చిత్రంలో ఎం.నర్సింహ్మా, తోట వీరాంజనేయులు

**సైఫాబాద్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఎఎన్‌ఎంలు తీవ్రమైన పని వత్తిడీని ఎదుర్కొంటున్న నేపథ్యంలో మెబైల్ అప్లికేషన్‌ను రద్దు చేసి పని వత్తిడిని తగ్గించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా ప్రభుత్వాని డిమాండ్ చేశారు. సోమవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆనేక మంది ఎఎన్‌ఎంలు వైద్య ఆరోగ్య సంక్షేమ కమిషనర్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవడానికి, అంటు వ్యాదులు ప్రబలకుండా కావాల్సిన జాగ్రత్తలు తీసుకోవడానికి, ఆరోగ్యం మెరుగు పరచడానికి కావాల్సిన ముందు జాగ్రత్తలతోపాటు అవగాహణ కల్పించడానికి, చిన్న పిల్లలకు టీకాలు వేయడానికి ఎఎన్‌ఎంలను ప్రభుత్వం ఉద్యోగంలోకి తీసుకోవడం జరిగిందన్నారు. 2016 సంవత్సరంలో ఆన్లైన్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఒకటి, రెండు యాప్‌లతో ప్రారంభమైన ఈ పనులు ప్రస్తుతం 14 మొబైల్ ఆప్లికేషన్స్‌లను పూర్తి చేయాల్సి వస్తున్నదన్నారు. తక్షణమే వారికి పనిభారాన్ని తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ ప్రతినిధి బృందం కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రామాంజనేయులు మాట్లాడుతూ కమిషనర్ ఎఎన్‌ఎంల సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. తమ సమ్యలను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో తెలంగాణ రాష్ట్ర 2వ ఎఎన్‌ఎంల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జే.పద్మ, బి.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## నగర పాలక ప్రజలకు అంకితభావంతో సేవలందించాలి

### జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

**హైదరాబాద్, సెప్టెంబరు 15,ప్రభాతవార్త:**



ఉద్యోగాలు పొందిన వారితో మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్ తదితరులు

ప్రజలకు ఉత్తమ సేవలను అందించడం ద్వారా జీహెచ్ ఎంసీకి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. కష్టపడి బాగా పనిచేయాలని నూతనగా ఉద్యోగాలకు సూచించారు. జీహెచ్‌ఎంసీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తూ.. మృతి చెందిన ఉద్యోగుల వారసులు 32 మందికి కారుణ్యా నియామకాల క్రింద జీహెచ్‌ఎంసీ ఉద్యోగాలు కల్పించింది.వీరికి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మ సోమవారం సాయంత్రం పధాన కార్యాలయంలోనియామక పత్రాలను అందించారు. 32 మందిలో 10 మంది జూనియర్ అసిస్టెంట్‌లుగా, 17 మంది ఆఫీస్ సబార్డినెట్‌లుగా, 5 మంది పబ్లిక్ హెల్త్ వర్కర్ లుగా వివిధ విభాగాల్లో పోస్టింగ్ ఇచ్చారు.ఈ సందర్బంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ...మీకు మంచి భవిష్యత్తు ఉంది. సానుకూల దృక్పథంతో , ఫిర్యాదులు లేకుండా ఉత్తమ పనితీరు కనబరచాన్నారు. విధి నిర్వహణలో సమయ పాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కమిషనర్ వేణు గోపాల్ తదితరులు ఉన్నారు.

### చిన్నారులకు విజయవంతంగా గుండె ఆపరేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

పీడియాట్రిక్ గుండె విభాగాన్ని పరిశీలించారు. ఇక్కడ చిన్నారులకు అందుతున్న వైద్యం పట్ల అరా తీశారు. స్వంత గడ్డకు సేవ చేస్తున్నారని రమణను ప్రశంసించారు. పుట్టుకతోనే గుండె సమస్యలతో బాధ పడుతున్న చిన్నారుల బంగారు భవిషత్తు కోసం ప్రభుత్వ సహకారంతో ఉచితంగా వైద్యం అందించి వారికీ కొత్త జీవితాలను ప్రసాదిస్తున్నారని దింట్లో బ్రిటన్ వైద్యులు పాలుపంచుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ప్రముఖ బ్రిటన్ వైద్యులు డాక్టర్ డి. రమణ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి తెలంగాణా ప్రభుత్వం,నిమ్స్ గుండె విభాగాదిపతి డాక్టర్ అమరేశ్వర్ రావు సహకారంతో గుండె ఆపరేషన్‌లు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. గుండె జబ్బులతో చాలా మంది చిన్నారులు ఈ రాష్టం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా వస్తున్నారని ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ నగరి భీరప్ప తెలియచేసారు.రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆరోగ్య శ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పూర్తిగా ఉచితంగానే నిర్వహిస్తున్నామని తెలియచేశారు.

### అక్కడ హోంగార్డులే వవర్

(మొదటి పేజీ తరువాయి)

బదిలీ అయ్యి వెళ్లి తిరిగి 'వ్యవహారం' తెలిసిన ఈ పరిధిలోని ఠాణాల్లోనే డ్రైవర్లుగా వచ్చి చేరారు. పశ్చిమ మండలంపై ఉన్నతాధికారుల సూక్ష్మదృష్టి ఉంటుందని పోలీసు శాఖలో ప్రతి ఒక్కరికి తెలుసు. అలాంటప్పుడు ఈ వ్యవహారంలో ఎందుకు ముందడుగు వేయడంలేదనది ప్రశ్నగా మారుతుంది.

### మళ్లీ మింగేసిందా?

(మొదటి పేజీ తరువాయి)

కోసం రాత్రి నుంచే జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం సాయంత్రం వరకు కూడా దినేష్ జాడ తెలియకపోవటంతో స్థానికులంతా తీవ్ర విషాదంలో మునిగి పోయారు.

### మామ, అల్లుడి సంగతి అంతే ..

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు నగరంలో కురిసిన కుండ పోత వానకు ఆసిఫ్‌నగర్ నాలాలో కొట్టుకు పోయిన మామ, అల్లుడి ఆచూకి దొరకలేదు. ఈ సంఘటన హాబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అఫ్జల్‌సాగర్ ప్రాంతానికి చెందిన మామరామ(25), వర్షం రావడంతో ఇంటి ముందు ఉన్న వస్తువులను ఇంట్లోకి తీసుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో క్షణాలలోనే కుంభ వృష్టిగా వర్షం రావడంతో వరదకు తట్టుకొలేక కింద పడికొట్టుకుపోతున్నాడు. అది చూసిన అల్లుడు అర్జున్(26), వర్షంలో కొట్టుకు పోతున్న మామ రామను రక్షించే ప్రయత్నంలో వరద తాకిడికి అఫ్జల్‌సాగర్ నాలాలో కొట్టుకుపోయారు. ఈవిషయాన్ని స్థానికులు హైడ్రా, జిహెచ్‌ఎంసి విభాగాలకు సమాచారం అందించారు. వెంటనే హైడ్రా కమీషనర్ రంగనాథ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనా,నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేనీ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆసిఫ్‌నగర్ నాలా నుండి మొదలుకుని ఎంజిబిఎస్ వరకు బల్దియా, హైడ్రా, పోలీసులు గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టిన దొరకలేదన్నారు. నాలా చుట్ట పెన్సింగ్ ఉన్నప్పటికి భారీ వర్షం కురిస్తే పరిస్థితి దారుణంగా మారుతుంది. ఇలాంటి సంఘటనలు జరిగినప్పడే పాలకులు, అధికారులు హడావుడి చేయడం తప్ప ఏమి లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### మత్తు వదలరా

(మొదటి పేజీ తరువాయి)

మనీ ఇవ్వటం మాత్రమే కాదు దాన్ని ఎలా వినియోగిస్తున్నారో చూడటం కూడా తల్లిదండ్రుల బాధ్యత. కరోనా తర్వాతి నుంచి స్కూల్ విద్యార్థులలో స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరిగింది. ఇంటర్నెట్‌లో ఎక్కువగా ఎలాంటి సైట్లను చూస్తున్నారు? ఏ సమాచారాన్ని తెలుసుకుంటున్నారో తల్లిదండ్రులు పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలని నిపుణులు సూచిస్తున్నారు. క్రెడిట్, డెబిట్ కార్డులతో ఏ వస్తువులు కొనుగోలు చేస్తున్నారో గమనించాలని తెలిపారు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడితే ఏ తరహా ఆటలాడుతున్నారో తెలుసుకోవాలని సూచించారు.

**మీ పిల్లల్లో ఈ లక్షణాలున్నాయా?**

-రోజులాగా కాకుండా ఒక్కసారిగా హైపర్ యాక్టివ్ అవడం.
-రాత్రివేళ నిద్ర పట్టదు.
-శరీర బరువు క్రమంగా తగ్గుతుంటుంది.
-కళ్లు ఎర్రగా మారతాయి. తరుచుగా కంటి చుక్కల మందులు వినియోగిస్తుంటారు.
-ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడుతుంటారు.
-ఒక్కసారిగా బిగ్గరగా అరుస్తుంటారు.
-ఇన్‌స్టాగామ్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాలలో చాలా ఉత్సాహంగా ఉంటారు.
-కోడ్ లాంగ్వేజ్‌లో మాట్లాడుకోవటం, సోషల్ మీడియాలో చాటింగ్ చేస్తుంటారు.
-పై లక్షణాలు కన్పిస్తే తప్పకుండా వారిపై కన్నేసి ఉంచాల్సిందే. లేకుంటే మత్తు పదార్థాలకు బానిసలవడం ఖాయమని మానసిక వైద్య నిపుణులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## నాలాలకు ఫెన్సింగ్

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన చోట నాలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను నిరంతరం కొనసాగించేలా చూడాలని కమిషనర్ సూచించారు. వర్షపు నీరు నిల్వ కాకుండా, నాలాలో స్వేచ్ఛగా ప్రవహించేలా ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు.

### డిటిడిసి కొరియర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

**బేగంపేట సెప్టెంబరు 15,ప్రభాతవార్త**

బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలోని శ్యాంలాల్ బిల్డింగ్ డీటీడీసీ కొరియర్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.మృతుని వయస్సు 50సంవత్సరాలు ఉంటుందని,ఎత్తు 5.4అడుగులు,మృతుడు బూడిద తెలుపు రంగు టీ షర్టు ,నలుపు రంగు చెడ్డీ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు.మృతుని వివరాలు తెల్సిన వారు బేగంపేట పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

### మూసీనదిలో బాలుడు మృతదేహం కోసం గాలింపు

**చార్మినార్,సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** మూసీనదిలో సొంత తండ్రి పడి వేసిన మూడేళ్ల బాలుడు అనాస్ మృత దేహం కోసం బండ్లగూడ పోలీసులు గాలిస్తున్నారు.ఈ నెల పన్నెండువ తేదీన పాతబస్తీ నూరినగర్‌కు చెందిన ఓ పండ్ల వ్యాపారైన మహ్మద్ అక్బర్ అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న తన చిన్న కొడుకు అనాస్ (3)ను దిండుతో ఊపిరాడకుండ చేసి హత్య చేశాడు. అనంతరం చిన్న కొడుకు మృత దేహాన్ని సంచిలో అక్బర్ తీసుకెళ్లి నయాపూల్ మూసీనదిలో పడ వేసిన విషయం విధితమే.పోలీసుల విచారణలో తానే చిన్న కొడుకు అనాస్‌ను హత్య చేశానని తండ్రి అక్బర్ ఒప్పుకున్నాడు.మూసీనదిలో పడి వేసిన మూడేళ్ల బాలుడు అనాస్ మృత దేహం కోసం బండ్లగూడ పోలీసులు గాలిస్తున్నారు.బండ్లగూడ పోలీసులు మహ్మద్ అక్బర్‌ను అదుపులోకీ తీసుకుని అన్ని కోణాలు నుంచి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## రేకుల షెడ్డు కూలి లేబర్ మృతి

**మరో ఆరుగురికి గాయాలు**

**పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** రేకుల షెడ్డు కూలి ఓ లేబర్ మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అపర్ణ రెడిమిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నందు గల లేబర్ రేకుల షెడ్యూపై వీకన్వెన్షన్ కాంపౌండ్ గోడ కూలి ఒరిస్సాకు చెందిన గగన్ కుమార్ బిస్వాల్ (56) మృతి చెందాడు. 2018 సంవత్సరంలో ఒరిస్సా నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చి అపర్ణలో లేబర్‌గా చేరాడు. ఈ ఘటనలో మరో ఆరుగురు రాజన్ కుమార్, ప్రకాష్ ఛత్రి, కర్మ సింగ్, సుధ, చందన కుమార్, ప్రశాంత్ లకు గాయాలు అయ్యాయి. ఈ మేరకు వీ కన్వెన్షన్, అపర్ణ యాజమాన్యాలపైన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డ ముఠా అరెస్ట్



**పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త**

ఒంటరిగా ఉన్న మహిళలను టార్కెట్ చేసుకొని చైన్ స్నాచంగ్‌కు పాల్పడిన ఓ ముఠాను పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు మేడ్చల్ జోన్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిది గుండ్లపోచంపల్లిలో హనుమాన్‌గడ్డ శ్రీ మేరు ఆస్పత్రి ముందు వాకింగ్‌లో భాగంగా నడుచుకుంటు వెళ్తున్న ఓ మహిళ మెడలో నుండి గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి మెడలో ఉన్న పుస్తెలతాడును తెంపుకునే క్రమంలో మహిళ పుస్తెలతాడును వదలకుండా పట్టుకుంది. మరో సగం చైన్‌ను లాక్కొని వెళ్లారు. భాదితురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగా సీసీటీవీల ఆధారంగా సోమవారం కండ్లకోయలో పట్టుకొని విచారించగా చైన్‌స్నాచింగ్ నిందితులుగా తేలారు. వీరిలో ఢిల్లీకి చెందిన అజయశర్మర్వాల్ (25), రాహుల్ సక్సేనా(23), రాజేష్ కుమార్ (38), సాగర్‌రాంపాల్ (25) లుగా గుర్తించారు. అయితే వీరిపై బోయిన్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్రవాహనాల చోరీకి గురైన కేసులు నిర్ధారణ అయ్యాయని, వారి వద్ద లభించిన నాలుగు తులాల బంగారు గొలుసు రెండు ద్విచక్రవాహనాలు, 4 స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించిన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పేట్ బషీరాబాద్ ఏసీపీ బాలగంగిరెడ్డి, సీఐ విజయవర్ధన్‌తో పాటు క్రైం టీం పాల్గొన్నారు.

## మేధా పాఠశాల విద్యార్థులను మరో పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు


బోయిన్‌పల్లి మేధా పాఠశాలను సందర్శించిన విద్యా శాఖ అధికారులు

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** ఓల్డ్ బోయిన్‌పల్లిలోని మేధా స్కూల్‌లో డ్రగ్స్‌తయారీలో తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసింది. సోమవారం విద్యా శాఖ అధికారులు మత్తు పదార్థాల తయారీ కేసులో సీజ్ అయినా మేధా పాఠశాలను సందిర్శించారు. ఈ పాఠశాలలో చదువుతున్న 63 మంది విద్యార్థుల భవిష్యత్తు మధ్యలో ఆగిపోకుండా ఇతర స్కూళ్లలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బాలనగర్ మండల విద్యా శాఖ అధికారి హరిశ్చంద్ర తెలిపారు. మేధా పాఠశాలకు 7వ తరగతి వరకు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. పాఠశాల యాజమాన్యం అందుబాటులో లేక పోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సోమవారం ఉదయం ఆందోళన చేపట్టారు. విద్యార్థుల చదువుల విషయంలో ఎలాంటి ఇబ్బందుల కలుగకుండా ఇతర పాఠశాలలో చేర్పిస్తామని విద్యా శాఖ అధికారులు భరోసా ఇచ్చారు.

## విద్యుత్‌శాఖ సిబ్బంది స్పందనతో తప్పిన ప్రమాదం


చెట్టు కొమ్మలు దగ్గర ఉండి కొట్టిస్తున్న ధర్మసమాజ్ ముషీరాబాద్ కన్వీనర్ గూడపర్తి సంతోష్‌కుమార్

**ముషీరాబాద్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** విద్యుత్ శాఖ సిబ్బంది సమయానికి స్పందించటంతో ముషీరాబాద్ నియోజకవర్గం, కవాడిగూడలో పెను ప్రమాదం తప్పిందని ధర్మసమాజ్ పార్టీ ముషీరాబాద్ కన్వీనర్ గూడపర్తి సంతోష్‌కుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కవాడిగూడ భాగ్యలక్ష్మినగర్ కాలనీలో హైటెన్షన్ వైర్లు చెట్ల కొమ్మలకు తగిలి మంటలు చెలరేగి, వైర్లు తెగి రోడ్డుపై పడిపోయాయి. ఇది గమనించిన స్థానికులు, ధర్మసమాజ్ పార్టీ నాయకులు విద్యుత్ శాఖకు ఫిర్యాదు చేయటంతో తక్షణమే స్పందించిన విద్యుత్ అధికారులు ఎమర్జెన్సీ టీమ్‌తో కలిసి విద్యుత్ సరఫరా నిలిపివేసి, చెట్ల కొమ్మలు కొట్టించి, వైర్లను పునరుద్ధరించారు. రాత్రి 9 గంటల నుండి అర్ధరాత్రి 2 గంటల వరకు కష్టపడి పనిచేసి, ఎవరికీ ఎటువంటి హాని జరగకుండా చర్యలు చేపట్టిన విద్యుత్ శాఖ సిబ్బందికి ధర్మసమాజ్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు ధన్యవాదములు తెలియచేశారు.

## 22వ దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

### -53వ రామాయణ్‌మేళా ఛీఫ్ కన్వీనర్‌గా గోవింద్‌రాఠి

**బేగంబజార్,సెప్టెంబర్ 15ప్రభాతవార్త:** 53వ రామాయణ్‌మేళా చీఫ్‌కన్వీనర్‌గా రాజస్థానీ ప్రగతి సమాజ్ కార్యదర్శి,బిజెపి నాయకులు గోవింద్ రాఠిని నియమించినట్లు రాజస్థానీ ప్రగతి సమాజ్ అధ్యక్షులు కమల్‌నారాయణ్ అగర్వాల్ తెలిపారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రతియేటా దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే రామాయణ్‌మేళా ఉత్సవాలకు తనపై నమ్మకం ఉంచి చీఫ్ కన్వీనర్‌గా ఎన్నుకోవడం సంతోషదాయకమన్నారు.నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో రామాయణ్‌మేళాను ఎంతో వైభవంగా నిర్వహిస్తామన్నారు.ఈనెల 22వ తేదినుంచి అక్టోబర్ 2వ తేది వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో రాజస్థానీ ప్రగతి సమాజ్,ఎగ్జిబిషన్ సొసైటి సంయుక్త ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తామన్నారు.

## ఆసరా పింఛన్ దారులకు రూ.6 వేలు పెంచాలి : శ్రీకిషన్ మాదిగ


ఆసరా పింఛన్లు పెంచాలని తిరుమలగిరి తహశీల్దార్ బిక్షపతికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నేత ఇటుక శ్రీకిషన్ మాదిగ తదితరులు

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** ప్రభుత్వం అందజేస్తున్న ఆసరా పింఛన్ దారులకు పింఛన్లు 6 వేల రూపాయలకు పెంచాలని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జి ఇటుకు శ్రీ కిషన్ మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద క్రిష్ణ మాదిగ పిలుపు మేరకు విహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో సోమవారం తిరుమలగిరి తహశీల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్బంగా శ్రీకిషన్ మాదిగ మాట్లాడుతూ వికలాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వింతంతు, ఒంటరి మహిళలకు రూ.4 వేలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పిఎస్ ఇన్‌ఛార్జిలు శ్రీనివాస్, మంద మధుకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు రేఖ మాదిగ, విశ్వనాథ్, బ్యాగరి నర్సింహ్మా, చింటూ, గుండమాల, మక్కల అశోక్,నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులను పరామర్శించిన సంతోష్ యాదవ్

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** ఈ నెల 14న ఆదివారం రాత్రి కురిషిన బారీ వర్షానికి లోతట్టు ప్రాంతంలో ఉన్న రైల్ నిలయం అంబేద్కర్ నగర్ వరదనీటి ప్రవాహానికి జలమయమైంది. విషయం తెలుసుకున్న మోండా డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నేత సి.సంతోష్ యాదవ్ బస్తీని సందర్శించి సహాయక చర్యలు చేపట్టారు.

## వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేసిన డిబిఎఫ్


వరద బాధితులకు నిత్యవసర సరుకులు అందజేస్తున్న డిబిఎఫ్ నాయకురాలు పులి కల్పన

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** ఇటీవల కురిషిన బారీ వర్షాలతో నష్టబోయిన వరద బాధితులకు సోమవారం అడ్డగుట్ట,లోహియా నగర్, గాంధీ నగర్, మొండి బండ నగర్ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వరద బాధితులకు డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన ఆధ్వర్యంలో వరద బాధితులకు బియ్యం,పప్పు, మంచినూనె వంటి నిత్యవసర సరుకులను అందజేశారు.కార్యక్రమంలో నళిని, శారధ, ఈశ్వర్,బన్నమ్మలు పాల్గొన్నారు.

## జలమయమైన రైల్ నిలయం, అంబేద్కర్ నగర్

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** లోతట్టు ప్రాంతంలో ఉన్న రైల్ నిలయం అంబేద్కర్ నగర్ బారీ వర్షానికి జలమయమైంది. విషయం తెలుసుకున్న మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, జిహెచ్‌ఎంసి ఇంజనీర్లతో కలిసి ఆమె పర్యటించి వరదనీరు సాఫీగా పోయే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆదివారం రాత్రి కురిషిన బారీ వర్షానికి నిత్యవసర సరుకులు, దుస్తులు, వంట పాత్రలు వరదనీటిలో కొట్టుకు పోయాయని స్థానికులు ఆమె దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో, ఏఈ చంద్రశేఖర్,నాయకులు చిన్న వీరయ్య,కొంతం నరేశ్, జిత్తూ, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాశ్‌గౌడ్ బిఆర్‌ఎస్‌లో ఉన్నారా? కాంగ్రెస్‌లో ఉన్నారా? స్పష్టం చేయాలి

- మూసీపై కట్టిన ప్రకాశ్‌గౌడ్ ఇంటిని హైడ్రా ఎందుకు కూల్చడం లేదు?
- బిఆర్‌ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి కార్తిక్‌రెడ్డి


నార్సింగిలో ఏర్పాటు చేసిన బిఆర్‌ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న పి.కార్తిక్‌రెడ్డి.

**నార్సింగి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ బిఆర్‌ఎస్‌లో ఉన్నారా? కాంగ్రెస్ పార్టీలో ఉన్నారా? ఓట్లేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు స్పష్టం చేయాలని బిఆర్‌ఎస్ నియోజకవర్గ ఇంచార్జి పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నార్సింగిలో బిఆర్‌ఎస్ ఏర్పాటు చేసిన సమావేశంలో కార్తిక్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ రాజేంద్రనగర్ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని, ఈ ప్రాంత ప్రజల సౌకర్యార్థం గచ్చిబౌలి నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో రైల్ వేయాలని ప్రతిపాదించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇక్కడి ప్రజలకు అన్యాయం చేస్తూ, ఈ ప్రాజెక్టును ఫోర్త్‌సిటీకి తరలించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్‌కు ఇంత అన్యాయం జరుగుతున్నా ఈ ప్రాంత ఎమ్మెల్యే ఎందుకు మిన్నకుంటున్నారని దుయ్యబట్టారు. మూసీపై వెలుస్తున్న అక్రమ కట్టడాలు సీఎం రేవంత్‌రెడ్డికి, హైడ్రా అధికారులకు కనిపించడం లేదా? జంట జలాశయాలలోకి గోదావరి నీటిని తీసుకువచ్చేందుకు అవసరానికి మించి ప్రజాధనంను వెచ్చించడం వెనుకాల మతలాబేమిటని ప్రశ్నించారు. నిబంధనల పేరుతో నిరుపేదల ఇళ్లు కూలుస్తున్న హైడ్రా అధికారులకు మూసీ నది మధ్యలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నిర్మించిన ఇళ్లు కూల్చే దమ్ము ఉందా? అని ప్రశ్నించారు. మూసీ ఎఫ్‌టిఎల్ పొడువు, అడ్డం ఎంతా అని ఆర్‌టిఐ కింద అడిగితే అధికారులు సమాధానం ఇవ్వడం లేదన్నారు. మూసీపై వెలిసిన అక్రమ కట్టడాలలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డిల వాటాలు ఎంతో స్పష్టం చేయాలన్నారు. పేదోళ్లకు ఓ నీతి పెద్దోళ్లకు మరో నీతా? రాజ్యాంగంలో ఇలాగే ఉందా అని కార్తిక్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ నార్సింగి మున్సిపల్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు నిజాముద్దీన్, వర్ధాచారి, మల్లేష్, చిరంజీవి, ఉదయ్, గణేష్, విష్ణు, మహేష్, ఆనంద్, లక్షణ్ పాల్గొన్నారు.

## వరదలతో చనిపోయిన కుటుంబాలకు రూ.25లక్షలు సాయం అందించాలి : సాయిబాబా


సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

**ముషీరాబాద్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** ఆదివారం కురిసిన భారీ వర్షం వల్ల వరదనీరు పొంగిపోయి, ముగ్గురు వ్యక్తులు కొట్టుకుపోవటం విచారకరమని, తక్షణమే ప్రభుత్వం చనిపోయిన వారి కుటుంబాలకు 25లక్షల రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల వల్ల, నాలాలలో ప్రజలు కొట్టుకుపోవటం గత 15 సంవత్సరాలుగా జరుగుతున్నప్పటికీ ప్రభుత్వాలు దీనిపై శాశ్వత పరిష్కార దిశగా ఆలోచన చేయకపోవటం విచారకరమన్నారు.బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు కిర్లోస్కర్ కమిటీ సూచనలను తుంగలో తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20నెలలు కావస్తున్నా ఎటువంటి ముందస్తు చర్యలు తీసుకోవటం లేదని, ప్రజల ప్రాణాలపై ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో అర్థమవుతోందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ స్పందించి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.సమావేశంలో నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, తడక వినోద్, సుక్రవేది తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో సేవా పక్షం కార్యక్రమాల సన్నాహక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న కాంతారావు

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** కూకట్‌పల్లి అసెంబ్లీ పరిధిలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో కన్వీనర్ శ్రీకర్ రావు అధ్యక్షతన ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా పక్షం కార్యక్రమాల సన్నహక సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు హాజరై మాట్లాడారు. మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు పక్షం రోజుల పాటు రాష్ట్ర పార్టీ ఇచ్చిన వివిధ సేవా కార్యక్రమాలను డివిజన్ వారిగా విజయవంతంగా నిర్వహించాలన్నారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం సందర్బంగా అన్ని డివిజన్ కేంద్రాల్లో జాతీయ జెండాలు ఎగురవేయాలని, ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని 17 సెప్టెంబర్ నుండి 2 అక్టోబర్ వరకు 15 రోజుల పాటు బిజెపి ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న "సేవా పక్షం"లో భాగంగా డివిజన్ల వారిగా మొక్కలు నాటడం, స్వచ్ఛభారత్ చేపట్టడం, రక్తదానం ఒంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సెప్టెంబర్ 21న నెక్లెస్ రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం నుండి నమో యువ రన్ 3కె మారథాన్ మాదకద్రవ్య రహిత దేశంగా మార్చాలన్న సంకల్పంతో రన్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి వేడుకలను కూడా జరపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రవి కుమార్, శంకర్ రెడ్డి, మహేందర్, అభిషేక్ గౌడ్, హరి ప్రసాద్, శివరంజన్, రమేష్, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## చదువు చెప్పే విద్యాసంస్థలపై ట్రేడ్ లైసెన్స్ పేరుతో కొరడా

### మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి


డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సురేష్‌రెడ్డి

**జీడిమెట్ల, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** కుత్బుల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలకు ట్రేడ్ లైసెన్స్ నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసం అని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నరసింహ రెడ్డికి కుత్బుల్లాపూర్ మండల ప్రైవేట్ పాఠశాల యజమాన్యలతో కలిసి సురేష్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ గౌరవ హైకోర్టు ఆఫ్ తెలంగాణ, ప్రైవేట్ పాఠశాలలకు, విద్యా సంస్థలకు ట్రేడ్ లైసెన్స్ అవసరం లేదని 2022వ సంవత్సరం ఆర్డర్స్ కూడా ఇచ్చిందని ఉపకమీషనర్‌కి తెలిపారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న ఇలాంటి చర్యల వల్ల మధ్యతరగతి పాఠశాలలపై తీవ్రప్రభావం చూపుతుందని, పాఠశాల యాజమాన్యాలు దివాళా తీసే స్థాయికి వస్తాయని అన్నారు. ఈ చర్యను నేను తీవ్రంగా ఖండిస్తూ ఇలాంటి అక్రమ చర్యలను, అక్రమ వసూళ్లను చేయవద్దని, ఇకమీదట ఇలా జరిగితే పాఠశాల సిబ్బందితోపాటు విద్యార్థిని విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. అలాగే మున్సిపల్ పరిధిలోని చాలా వరకు ఇండ్లకు 100 వంద శాతం పన్ను వేస్తున్నారు. మా డివిజన్ గలవారు కదు పేద వారు వారిపై పన్నుల పేరుతో అధిక భారం వెయ్యవద్దని ప్రజావాణిలో స్థానికులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సురేష్ రెడ్డితో పాటు డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి శివాజీ, ప్రైవేట్ పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు ఉన్నారు.

## లక్షణరేఖ నిర్మాతకు సత్కారం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** ప్రముఖ నిర్మాత లక్షణరేఖ సినిమా 50 సంవత్సరాల పండుగ వేడుకలు సోమవారం సంస్కృతిరత్న, ఇటిక్లా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కె.ధర్మారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శతాధిక చిత్ర నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ ఆధ్వర్యంలో తెలుగు చిత్ర సీమ ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ తెలుగు మూవీ అసోసియేషన్, "ఇట్మా" సంస్థ తరపున ప్రముఖ సినీ నటులు మురళీమోహన్, సినీనటి జయసుధ, దర్శక నిర్మాత యన్ గోపాలకృష్ణ లను , కె.ధర్మారావు ఘనంగా సత్కరించి అభినందించారు.

## బాచుపల్లి ఆకృతి కన్‌స్ట్రక్షన్‌పై చర్యలు తీసుకోవాలి : ఆకుల సతీష్

**నిజాంపేట్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** బాచుపల్లి సర్వేనెంబర్ 454 నందు ప్రభుత్వ భూములు 400 గజాలు ఆక్రమించుకొని అప్రోచ్ రోడ్డుగా చూపించుకోవడమే కాకుండా ప్రభుత్వ భూమి బోర్డు తీసివేసి సిమెంట్ రోడ్డు వేసుకోవడంపై తక్షణమే ఆకృతి కన్స్రక్షన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి, రోడ్డును తొలగించి ప్రభుత్వ భూమిని అని బోర్డు పెట్టాలని సోమవారం ఆకుల సతీష్ ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి ఫిర్యాదు చేయడం జరిగింది. ఫిర్యాదుకు స్పందించిన అడిషనల్ కలెక్టర్ ఎంఆర్ఓకి ఫోన్ చేసి చర్యలు తీసుకొని బోర్డు పెట్టాలని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, శ్రీనివాస్, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మి కమలాకర్‌కి జీవిత సాఫల్య పురస్కారం


పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** కూకట్‌పల్లిలోని రాందేవ్ రావ్ ఆసుపత్రిలో పనిచేస్తున్న లక్ష్మి కమలాకర్‌కి జీవిత సాఫల్య పురస్కారం, కల్పన మంతెనకి సుస్వారూత సేవా రత్న పురస్కారం, శ్రవణ్ రెడ్డికి బెస్ట్ ఫార్మసీ మెయింటెనెన్స్ అవార్డులతో ముగ్గురిని యాక్ట్ నౌ ఫౌండేషన్ సన్మానించింది. గ్రాండ్ మాస్టర్ లక్ష్మి కమలాకర్ భారత దేశ మొత్తంలో 700 మంది రేఖి థెరపిస్ట్‌లను తయారు చేయడమే కాకుండా 11 మందిని గ్రాండ్ మాస్టర్‌లను తయారు చేసారు. కుటుంబ భాద్యతలని, వృత్తి బాధ్య తలను సమానంగా పోషిస్తున్నారు. వీరిని సత్కరించటం మమ్మల్ని మేము సత్కరించటంగా భావిస్తున్నాం అని నిర్వా హకులు తెలియజేశారు. కల్పనా మంతెన రాందేవ్ రావ్ హాస్పటల్‌లో గత 15 సంవత్సరాలుగా సమాజానికి అత్యు న్నతమైమ సేవల్ని అందిస్తున్నారనీ సమాజంలో అట్టడుగువ ర్గాలకి అత్యున్నతమైన మెడికల్ వైద్య పరమైన సహాయ సహకారాలని స్కూల్ హెల్త్ ప్రోగ్రాముని నిర్వాటకంగా కొనసాగిస్తున్నారనీ అన్నారు. వీరికి అబ్దుల్ కలం పేరుమీద అవార్డుని ప్రదానం చేయడం జరిగిందన్నారు. నల్ల శ్రవణ్ కుమార్ రెడ్డి గత 18 సంవత్సరాలుగా రాందేవ్ రావ్ ఆసుపత్రిలో అత్యున్నతమైన ఫార్మసీ సేవలు అదించడమే కాకుండా అనేక మందికి అన్నదానం, రక్తదానం, అత్యవసర పరి స్థితిలో ఉన్న రోగులకి సేవచేయడం ద్వారా శ్రవణ్ రెడ్డికి ఈ అవార్డుని ప్రధానం చేయడం ఆక్ట్ నౌ ఆర్గనైజషన్ వారు అత్యంత పురస్కారంగా భావిస్తున్నారు. ఈ సందర్భంగా లక్ష్మి కమలాకర్ మాట్లాడుతూ తనకు జీవిత సాఫల్య పుర స్కారాన్ని ఇచ్చిన ఆక్ట్ నౌ సభ్యులందరికి కృతజ్ఞతలు తెలిపా రు. కల్పనా మంతెన మాట్లాడుతు ఈ అవార్డు తీసుకోవడం ద్వారా తన భాద్యత మరింత పెరిగిందని రాందేవ్ రావ్ ఆసుపత్రి సేవలను కూకట్‌పల్లి ప్రాంతానికే కాకుండా మిగతా పరిసర ప్రాంతాలకు విస్తరించాలని తెలిపారు. శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ సమాజం పట్ల మరింత భాదతాయూతంగా ప్రవర్తిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ కమలా కర్, డాక్టర్ యోబు, సరస్వతి, శోభా, యాక్ట్ నౌ ఫౌండేషన్ ప్రెసిడెంట్ కేఎస్ మూర్తి పాల్గొన్నారు.

## గాంధీనగర్ డివిజన్‌లో నాలా పరీవాహక ప్రాంతాల సందర్శన


దోభిఘాట్ బస్తి వాసుల సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్

**చిక్కడపల్లి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** ఎడదెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి నాలాపరీవాహక ప్రాంతాలైన గాంధీ నగర్ డివిజన్ లోని వివిధ ప్రాంతాలను సోమవారం స్థానిక కార్పొరేటర్ సూచనల మేరకు బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్ సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. అశోక్ నగర్ నాలా పరివాహక బస్తీలైన అరుంధతి నగర్,దోభిఘాట్, సబర్మతి నగర్,చిక్కడపల్లి బాపు నగర్ బస్థిలోని ప్రజలు వరద నీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న సమాచారంతో బస్తీల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్‌తో చర్చించి జిహెచ్‌ఎంసి పారిశ్యుద్ధ సిబ్బంది ద్వారా వరద వల్ల పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగింపచేసారు. ఇంజనీరింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ మహేష్ తో మాట్లాడి వారి సిబ్బంది ద్వారా వరద వల్ల నీట మునిగిన బస్తీల్లో నీరు అశోక్ నగర్ నాలాలోకి వెళ్ళేవిధంగా వెంటనే పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, బస్తీల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమస్యలను వెంటనే కార్పొరేటర్ కార్యాలయం నెంబర్ 77998 19991 కు సమాచారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు ఆనంద్ రావు, సాయి కుమార్,దోభి ఘాట్ బస్తి వాసులు మల్లికార్జున్,అనిల్, నగేష్,జాంఫీర్,లక్ష్మి,వెంకటేష్,నాని పాల్గొన్నారు.

## అభ్యుదయ సాహిత్య యుగ కర్త గురజాడ : దామోదర్ గుప్త


ప్రసంగిస్తున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్త

**చిక్కడపల్లి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** భావ కవిత్వ యుగకర్త రాయప్రోలు సుబ్బారావు కాగా అభ్యుదయ కవిత్వ యుగకర్త గురుజాడ అప్పారావుగా ప్రముఖ కవి డాక్టర్ సి నారాయణ రెడ్డి తన పరిశోధనా గ్రంథంలో పేర్కొన్న అంశాన్ని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ గుర్తు చేశారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా గురజాడ అప్పారావు యాది లో పేరిట సంస్మరణ సమావేశం గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్. జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోలేటి దామోదర్ మాట్లాడుతూ గ్రాంథిక భాష లో మాత్రమే సాహిత్య రచనలు చేసే కాలం లో ఆధునిక భాష లో గురజాడ ముత్యాల సరాలు రాసి నాటి భాషా పండితుల మెప్పు పొందారు అని చెప్పా రు అయన రాసిన "దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుష్య లోయ్ " గీతం లోని పాదం నినాదం గా నేటికీ నిలిచి ఉంది అన్నా రు అయన నాటి సామాజిక ఆర్థిక రాజకీయ వ్యవస్థల్ని ప్రతిబించే విధం గా కన్యాశులకం నాటకం రాసి ప్రజలలో చైతన్యం కలిగించా రనీ చెప్పారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్థన మూర్తి అధ్యక్షత వహించిన సభలో కవి రఘుశ్రీ, గాయనీ మణులు ఎస్ శ్రీదేవి , జి సీత పాల్గొన్నారు.

## కళాశాలలో బాలుడు పై తోటి విద్యార్థులు దాడి

**మేడిపల్లి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** తోటి విద్యార్థులు ఒక విద్యార్థిని ర్యాగింగ్ చేస్తూ దాడి చేసిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగరకి చెందిన గంగాధరి గణేష్ (17) అనే విద్యార్థి ఎస్ ఆర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు . గణేష్ ని హాస్టల్ లో ముగ్గురు తోటి విద్యార్థులు మొదటినుంచి ర్యాగింగ్ చేస్తూ, కొట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసు కున్న కుటుంబ సభ్యులు రమేష్ ని బోడుప్పల్ లోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి వైద్యం చేయించారు. కళాశాల ప్రిన్సిపల్ హరీష్ రెడ్డి కి తెలిపిన ఎలాం టి స్పందన రాకపోవడంతో, మేడిపల్లి పోలీస్ స్టేషన్ లొ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఎస్ ఆర్ జూనియర్ కళాశాల ముందు బంధువులు విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన కుదిగారు. మేడిపల్లి సిఐ గోవిందరెడ్డి స్పందిస్తూ డబ్బుల విషయంలో జరిగిన గొడవ అని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఘనంగా ఇంజనీర్స్‌డే వేడుకలు

### -వివిధ విభాగాల్లో సేవలందించిన ఇంజనీర్లకు సత్కారం



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న మహేందర్‌రెడ్డి, భీమ్‌రావు, రమేష్, నర్మద తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 15,ప్రభాతవార్త:** భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్(ఐ ) ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే కొండాపూర్ లోని తెలంగాణ కాంట్రాక్టర్స్ కల్చరల్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసిసిఈ(ఐ) సౌత్ వైస్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్ కాచర్ల, ప్రత్యేక ఆహ్వానితులుగా ఏసిసిఈ(ఐ) జిసి మెంబర్ కాశీరామ్ ఆడెపు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ రంగంలో విశేష సేవలందించిన ఇంజనీర్లను సన్మానించారు. కన్సల్టెంట్ రంగంలో సేవలందిస్తున్న ఇంజనీర్లు ఎస్ రాజగోపాల రెడ్డి, వివి కృష్ణారెడ్డి, ఇండస్ట్రియల్‌లో ఇంజనీర్ బి శీనయ్య, అకాడమియా విభాగంలోపి శ్రీనివాస రావు, ప్రొఫెసర్ నీలిమ సత్యం, విద్యార్థి డి చంద్రకాంత్ లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంటర్ చైర్మన్ ఎస్ మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ భీమ్ రావ్ జలిగమ, సెక్రటరీ రమేశ్ చీకలపర్వి, ట్రెజరర్ వి.సిహెచ్ నర్మద, కో అప్షన్ మెంబర్ అక్కల సుధాకర్, పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.

## 27ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

### అలనాటి తీపి గుర్తులు నెమరేసుకొన్న మిత్రులు...


ఆత్మీయ సమ్మేళనం కలుసుకున్న పూర్వ విద్యార్థులు

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త** పూర్వ విద్యార్థులు ఒకేచోట కలుసుకొని హాయ్ రవి, హాయ్ ఉమా, హాయ్ మామ, లక్ష్మి ఎలా ఉన్నావ్, శ్రీదేవి బాగున్నావా, ఏరా బాబాయ్ ఎట్లున్నావ్, హలో పావని, ఎలా ఉన్నారు ఫ్రెండ్ అంటూ ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకున్న మధుర క్షణం కూకట్‌పల్లి పరిధిలోని పిఎన్‌ఎం హైస్కూల్‌లో చోటు చేసుకుంది. గత 1997–98 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం హోటల్ వైష్ణవి గ్రాండ్‌లో ఘనంగా నిర్వహించుకున్నారు. దాదాపు 27 ఏళ్ల తరువాత విద్యార్థులు అందరూ ఒకే వేదికపై కలుసుకోవడంతో ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకుని అలనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ముందుగా తాము చదివిన పాఠశాలకు వెళ్లి వారి చివరగా కూర్చున్న క్లాస్ రూమ్‌లో బెంచీలపై కూర్చొని ఒక్కసారిగా చిన్నతనంలోకి వెళ్లి తమ మధురానుభూతులను నెమరువేసుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి తినిపించుకున్నారు. చిన్నతనంలో చేసిన అల్లరి, చిలిపి పనులు గుర్తు చేసుకొని భావోద్వేగానికి గురయ్యారు. ఒకరి తరవాత ఒకరు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల గురించి వివరించుకొని ఆట పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్న పిల్లల్లా సరదాగా కాసేపు గడిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనం ఎంత ఎదిగినా ఆనాటి రోజులను ఆ జ్ఞాపకాలు మన నుండి దూరం కావని ఇలాగే అప్పుడప్పుడు కలుసుకొని మంచి చెడులు పంచుకోవాలని, మనం చదివిన పాఠశాల, కళాశాలల అభివృద్ధిలో కొంత భాగస్వామ్యులు కావాలన్నారు.


వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, REDDYGARI YUGANDHARA REDDY S/o Late REDDYGARI SESHI REDDY R/o H.No. 1-127, Munagala Village, Gudur Mandal, Kurnool, AP-518466 have changed my name to R YUGANDHARA REDDY vide affidavit dated 15 Sep 2025

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



IN THE COURT OF THE III RD SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT; SECUNDERABAD
O.S.No 287 of 2025

Between:-
1. Sri. Sunil Kumar Agarwal, S/o Late. Sri. Sathyanarayana Agarwal, aged 52 years, Occ: Business,
2. Sri. Pradeep Agarwal, S/o Late. Sri. Sathyanarayana Agarwal, aged 51 years, Occ: Business. Both R/o Flat No.601 & 604, 'D' Block, "Welkin Park" P.No.1-10-32, VTC, Secunderabad.
3. Smt. Madhu Gupta, W/o Sri. Vinod Kumar Gupta, D/o Late Sri. Sathyanarayana Agarwal, Aged 54 years, Occ: House wife, R/o Flat No.504"Shiv Sadan" P.No.1-8-153 & 154/C, P.G.Road, Secunderabad. ...PLAINTIFFS

AND

1. The Tahsildar/Mandal Revenue Officer, Secunderabad Mandal, Minister Road, Secunderabad.
2. All Concerned. ....DEFENDANTS

To,
1. The Tahsildar/Mandal Revenue Officer, Secunderabad Mandal, Minister Road, Secunderabad.
Defendant No.1

This is to inform by this public notice that the plaintiffs herein have filed the above suit for Declaring them as the Legal heirs of Late. Sri. Sathyanarayana Agarwal, who expired on 23-10-2024 as they are the only Legal heirs of the deceased. The above suit stands posted to 23-09-2025 at 10.30 A.M. before the aforesaid Honorable Court for your appearence. If you have any objection for declaring them may appear in person or through advocate on the aforesaid date, otherwise it is deemed there are no objections, and the matter will be decided Exparte.

"BY ORDER OF COURT"
M/s G.B.S. Prasad, G. Ravichandran, Advocates,
1-8-63, J.N. Colony, P.G Rd, Secunderabad.

IN THE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT AT KUSHAIGUDA
OS No. 244 OF 2024

Between:
Sri Mora Sanjeeva Reddy ...Plaintiff
AND
Sri Rasukatala Laxman & (12) others ...Defendants

To
Smt Makula Lakshmma @ M Vijaya Wife of Gonayya, Aged about 63 years. Occ: Housewife. H.No. 30-264/1/10, Old Safilguda, Medchal-Malkajgiri Dist. ...Defendant No 3

NOTICE

The Plaintiff filed OS No 244 of 2024, on the file of II Addl. Senior Civil Judge, Medchal - Malkajgiri District at Kushaiguda, suit for declaration of title, perpetual injunction and to declare the registered sale deeds & gift deeds as null & void not binding on the plaintiff against the defendants. The Hon'ble Court directed to issue notice to you the defendant No.3, in the news paper and posted the matter to 19.09.2025 for your appearance & written statement. You are hereby required to attend the Hon'ble Court on 19.09.2025 at 10: 30 A.M. either in person or through your counsel, failing which the matter will be decided ex-parte in your absence.

//BY ORDERS OF THE COURT//
Sd/- M/s G. PURSHOTHAM RAO ADVOCATE
SRI SRIVARI LOGILI
12-11-1321, Warasiguda, Secunderabad-500 061, Telangana.
Mobile No. 9866206503

IN THE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT AT KUSHAIGUDA
IA No. 560 OF 2024
IN
OS No. 244 OF 2024

Between:
Sri Mora Sanjeeva Reddy ...Petitioner/Plaintiff
AND
Sri Rasukatala Laxman & (12) others ...Respondents/Defendants

To
Smt Makula Lakshmma @ M Vijaya Wife of Gonayya, Aged about 63 years. Occ: Housewife. H.No. 30-264/1/10, Old Safilguda, Medchal-Malkajgiri Dist. ...Respondent No 3

NOTICE

The Plaintiff filed IA No. 560 of 2024 under Order XXXIX Rule 1 & 2 CPC to grant Ad-Interim Injunction, restraining the respondents from interfering into peaceful possession & enjoyment of the petition schedule property in OS No.244 of 2024, on the file of II Addl. Senior Civil Judge, Medchal - Malkajgiri District at Kushaiguda, suit for declaration of title, perpetual injunction and to declare the registered sale deeds & gift deeds as null & void not binding on the plaintiff. The Hon'ble Court directed to issue notice to you the Respondent No.3, in the news paper and posted the matter to 19.09.2025 for your appearance & counter, if any.
You are hereby required to attend the Hon'ble Court on 19.09.2025 at 10: 30 A.M. either in person or through your counsel, failing which the matter will be decided ex-parte in your absence.

//BY ORDERS OF THE COURT//
Sd/- M/s G. PURSHOTHAM RAO ADVOCATE
SRI SRIVARI LOGILI
12-11-1321, Warasiguda, Secunderabad 500-061, Telangana.
Mobile No. 9866206503

IN THE COURT OF HON'BLE II Addl JUNIOR CIVIL JUDGE Cum II Addl JUDICIAL MAGISTRATE-OF 1st CLASS - MALKAJGIRI MEDCHAL MALKAJGIRI DISTRICT; AT::KUSHAIGUDA
O.S.No. 569 of 2025

Between:-
Perisetti Venkateswaramma & Others ...Petitioners
AND
Mandal Revenure Officer Alwal Mandal & Others ...Respondents

PUBLIC NOTICE

General Public are hereby notified that my Clients 1. Perisetti Venkateswaramma (wife of Late Mr. Perisetti Anand Rao),
2. Perisetti Nagalakshmi (Daughter of Late Mr. Perisetti Anand Rao)
3. Naga Raju Perisetty (Son of Late Mr. Perisetti Anand Rao) have filed above Suit for declaring them as them as legal Heirs of Late Mr. Perisetti Anand.
That the above case is posted for hearing on 25/09/2025 and anybody having any objection for declaring the Petitioners herein as Legal heirs of Late Mr. Perisetti Anand Rao, may represent their case before the Hon'ble Court on the above date of hearing failing which, the matter will be decided and no Objections of whatsoever nature will be entertained thereafter.

//BY ORDER OF COURT//
Sd/- M.S. SADIQUE & A.S SHANKER GOUD (ADVOCATES)
Mobile No: +91 9885248424

## కాలనీల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి

### : ఏపీఏయు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి




వివిధ కాలనీ సంఘాల ప్రతినిధులతో కలిసి ఐక్యతను చాటుతున్న ఏపీఏయు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మడిగెల విజయభాస్కర్ రెడ్డి తదితరులు

**మలక్ పేట ,సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** కాలనీలలో దశాబ్దాలుగా పేరుకుపోయిన పలు సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తామని ఏపీ ఏయు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మడిగెల విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఏపీఏయు కాలనీ కమ్యూనిటీ హాల్ లో విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో 18 కాలనీల అధ్యక్ష, కార్యదర్శులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 కాలనీల సంఘాలతో కలిసి నూతనంగా సైదాబాద్ ఐక్యవేదికను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఐక్యవేదికకు కళ్యాణ్ నగర్ కాలనీ అధ్యక్షుడు గోవిందరాజు కోఆర్డినేటర్ గా వ్యవహరిస్తారని తెలిపారు. గత 50 సంవత్సరాల క్రితం ఏర్పడిన పలు కాలనీలో ఇప్పటికీ వివిధ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని పేర్కొన్నారు. వెంకటాద్రి నగర్, రెవెన్యూ బోర్డు కాలనీలో పలు ప్లాట్లను ప్రభుత్వాలు రెగ్యులరైజ్ చేయకపోవడంతో యజమానులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వర్షాలు కురిస్తే వరద ముంపుతో పలు కాలనీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులు సహకరిస్తున్నప్పటికీ, కొంతమంది అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి అందరూ కలిసికట్టుగా సమిష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, శ్రీకరం శ్రీనివాస్, లక్ష్మణ్ సింగ్ ఠాగూర్, సురేందర్ రెడ్డి, భక్తవత్సలం, కృష్ణారావు రాజేష్ బిందు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వక్ఫ్ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా అమలు చేస్తుంది

### : ఎంబిటీ అధికార ప్రతినిధి అంజాదుల్లా ఖాన్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ తదితరులు

**మలక్ పేట ,సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన వక్ఫ్ చట్టాన్ని మొట్ట మొదటగా తెలంగాణ రాష్ట్రంలో ఎలా అమలు చేస్తారని ఎంబిటీ అధికార ప్రతినిధి అంజాదుల్లా ఖాన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. చంచలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎంబిటి ఆధ్వర్యంలో జరిగిన 34వ మిలాద్ ఉన్ నబి జల్సా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా అమలు చేయనీ వక్ఫ్ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో అమలు చేసి ముస్లిం వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. ముస్లిం హక్కులను కాలరాస్తున్న కొత్త వక్ఫ్ చట్టాన్ని తెలంగాణ రాష్ట్రం అమలు చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలకు జరుగుతున్న అన్యాయాన్ని అందరూ కలిసి ఐక్యతతో ఎదుర్కోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా అధ్యక్షుడు మాజీద్ ఉల్లా ఖాన్, ఢిల్లీ జామియా ఇస్లామిక్ స్టడీస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ అహ్మద్ చతుర్వేది, న్యూఢిల్లీ జెఎన్ యు ప్రొఫెసర్ సూఫీ పీస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ హఫీజ్ ఉర్ రెహమాన్ తదితరులు మాట్లాడుతూ ముస్లింల హక్కులను సాధించేందుకు అందరూ కలిసికట్టుగా పోరాడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మత పెద్దలు, వివిధ సంఘాల నాయకులు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.

## ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్‌లో కార్పొరేటర్ పర్యటన



**మల్కాజిగిరి సెప్టెంబరు15,ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని షిరిడి నగర్ ఎన్ఎండిసి కాలనీ ఉప్పరగూడ రాజనగర్ కాలనీలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి జలమయమైన ప్రాంతాల్లో కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ అధికారులతో కలిసి పర్యటించారు. 600 ఎం ఎం డయా పైప్ లైన్ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు పెండింగ్ ఉన్న రోడ్డు పనులు పిట్టల బస్తీ లో పెండింగ్ లో ఉన్న కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి చేయాలని తదితర సమస్యలు స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడం జరిగింది పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈ లౌక్య, ఏఈ సత్యలక్ష్మీ, వర్క్ ఇన్స్పెక్టర్ రజనీకాంత్, ఉమేష్ సింగ్, కిషోర్,ఎం డి మజీద్, కాలనీవాసులు నరసింగరావు శ్రీధర్ రెడ్డి బుచ్చి రాములు గోపీనాథ్ గోపాల్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు

## ఆశావర్కర్లకు పెండింగ్ బకాయిలను చెల్లించాలి



**మల్కాజిగిరి సెప్టెంబరు15,ప్రభాతవార్త :** మల్కాజ్గిరి సర్కిల్‌లోని ప్రజావాణీ మరియు జి.హెచ్ఎంసి ప్రధాన కార్యాలయం లోని ప్రజావాణి కార్యక్రమంలో మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ పాల్గొన్ని ముఖ్యంగా గత సంవత్సరం చెప్పట్టిన సమగ్ర సర్వే లో పాల్గొన్న ఆశ వర్కర్లకు ఇప్పటి వరకు 10,000/ డబ్బు చెల్లించకపోవడం పై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.వెంటనే వారికీ బకాయిలు చెల్లించాలని డిప్యూటీ కమీషనర్ సుల్తానా ని మరియు ఎలక్షన్స్ సెల్ అడిషనల్ కమీషనర్ మగత యారు ని కోరగా, అందరి వివరాలు అధికారులు తీసుకోవడం జరిగింది. అదే విధంగా పలు ప్రదేశాలు పార్కుల క్రింద అభివృద్ధి చెయ్యాలని కోరామని కానీ టౌన్ ప్లానింగ్ వారి సహకారం లేకపోవడం వల్ల అభివృధి పనులు ఆగిపోయాయని అన్నారు. వెంటనే సంబంధిత శాఖలకు కావాల్సిన అనుమతులు ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ వారిని కోరారు.ఈ కార్యక్రమం లో సంజీవ్, సంతోష్, ఆశ వర్కర్లు హేమలత,వసంత, జయశ్రీ, సుల్తానా, లక్ష్మీ మరియు పెద్ద ఎత్తున ప్రజలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## పెన్షన్ పెంపు హామీ నెరవేర్చండి : ఎమ్మార్పీఎస్, విహెచ్‌పీఎస్





తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న విహెచ్‌పిఎస్ నాయకులు

**నేరేడ్ మెట్,సెప్టెంబర్ 15,ప్రభాతవార్త** వికలాంగులకు, పెన్షన్ దారులకు ఇచ్చిన హామీని అమలు చేయండి లేకపోతే పదవుల నుండి దిగిపోండి" అని ఎమ్మార్పీఎస్, విహెచ్‌పీఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాలు జరిగాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు వినయ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి తహసీల్దార్ కార్యాలయాన్ని పెద్ద ఎత్తున ముట్టడించారు.ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు, జిల్లా ఇన్‌చార్జ్ లక్ష్మణ్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు రామచందర్ మాదిగ, ఎంజెఎఫ్ రాష్ట్ర నాయకుడు మనోహర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పెన్షన్ దారులు, మహిళలతో కలిసి నినాదాలు చేసిన సంఘ నాయకులు, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ పెన్షన్ దారులకు 2 వేల నుండి 4 వేల రూపాయలు, వికలాంగులకు 4 వేల నుండి 6 వేల రూపాయలు పెంచి ఇస్తామని వాగ్దానం చేసి 20 నెలలు గడిచినా అమలు చేయకపోవడం ఘోరమని మండిపడ్డారు."ఇప్పుడు మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టాం. ఇచ్చిన హామీ అమలు చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగాలి" అని హెచ్చరించారు.ఈ ముట్టడిలో ఎమ్మార్పీఎస్ నాయకులు బచ్చలకూర సురేష్, కలుమూరి వెంకటేష్, గజ్జెల్లి రామచందర్, విహెచ్‌పీఎస్ నాయకులు బి. రజిత, ఎం. వెంకటేష్, రాముకు యాదవ్, ఎస్. గణేష్, ఆర్. మల్లేష్, కె.బి. జయహరి, కౌసర్ బేగం, షహీన్, హరిత, ఈశ్వర్ గౌడ్, మున్ని తదితరులు పాల్గొన్నారు.

**సైదాబాద్ మండల తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా**

**సైదాబాద్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** వికలాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచాలని, ఆసరా పెన్షన్లను రూ.4 వేలకు పెంచాలని, తీవ్ర వైకల్యం కలిగిన వారికి రూ.15 వేలు ఇవ్వాలని, దరఖాస్తు చేసుకున్న వారికి నూతన పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, చేయూత పెన్షన్ దారుల హక్కుల పోరాట సమితిల ఆధ్వర్యంలో సోమవారం సైదాబాద్ మండల తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విహెచ్‌పిఎస్ కోర్ కమిటి వైస్ ఛైర్మన్, హైద్రాబాద్ జిల్లా ఇంఛార్జి అందె రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొన్న అంశాలతో పాటు వికలాంగుల హక్కుల పోరాట సమితి ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చిన అంశాలన్నింటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంజిగౌడ్, షేక్ మస్తాన్ వలి, నాగరాజు, యాదమ్మ, రమాదేవి, మహేష్, శరత్ కుమార్ మాదిగ, భూమగల వినోద్ కుమార్ మాదిగ, యడవలి యాదయ్య మాదిగ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తదితరులు

**మలక్ పేట ,సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని స్థానిక ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణ లో జోనల్ కమిషనర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్, ఫలక్ నుమా సర్కిళ్ల కి చెందిన టౌన్ ప్లానింగ్ సమస్య ల పై 3 ఫిర్యాదులు, చాంద్రాయణ గుట్ట, చార్మినార్ సర్కిళ్ల కి చెందిన ఇంజనీరింగ్ విభాగం సమస్యలపై 3 ఫిర్యాదులు మొత్తం 6 ఫిర్యాదు అందయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... చార్మినార్ జోన్ పరిధిలోని మలక్ పేట్, సంతోష్ నగర్, చాంద్రాయణ గుట్ట, చార్మినార్, ఫలక్ నుమా, రాజేంద్ర నగర్ సర్కిళ్ల పరిధిలోని ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజావాణి కార్యక్రమం లో తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తమకు అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ డి.శంకర్ సింగ్, ఇంజనీరింగ్ విభాగం ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ సీ పీ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, యూ బీ డీ డిప్యూటీ డైరెక్టర్ విష్ణు వర్ధన్, ఏ యం సీ రాజారావు, ఎలక్ట్రికల్ ఇఇ సతీష్ రెడ్డి, మలేరియా ఎస్ఇ నామాల శ్రీనివాస్, యూబీడి టౌన్ ప్లానింగ్ ఏ సీ పీలు భాను చందర్,సుధాకర్,ఎల్ఆర్ఎస్ ప్రత్యేక డిప్యూటీ తాహసిల్దార్ యాసీన్, వెటర్నరీ సీని యర్ అసిస్టెంట్ హమీద్, బిల్ కలెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

## చిలుకానగర్‌లో పార్కులకు మహర్దశ : బన్నాల గీత



చిలుకానగర్‌లో పార్కు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని చిలుకానగర్ డివిజన్‌లో వివిధ పార్కుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక కార్పొరేటర్, స్టాడింగ్ కమిటి మాజీ మెంబర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. సోమవారం డివిజన్‌లో జిహెచ్ఎంసి హార్టికల్చర్ విభాగం డైరెక్టర్ అన్నపూర్ణతో కలిసి పలు పార్కులను సందర్శించారు. బన్నాల గీత మాట్లాడుతూ రూ.కోటి వ్యయంతో పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, బాలాజీ ఎన్‌క్లేవ్ పార్కులో కాంపౌండ్ వాల్‌తోపాటు, పెయింటింగ్ చేయించాలని కోరారు. గేట్‌తోపాటు మరో బోరు వేయాలని కోరారు. వాకింగ్ ట్రాక్, బెంచీలను ఏర్పాటు చేయాలని, పనులు వేగవంతం చేయాలని సూచించారు. అదే విధంగా నార్త్ కళ్యాణపురిలో కాలనీలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్‌ను పార్కు బయటికి మార్చాలని, వాచ్‌మెన్ రూమ్, బాత్ రూమ్‌లు నిర్మించాలని సూచించారు. పార్కులో ఆకతాయిలు గంజాయి సేవిస్తున్నారని,మొక్కలు ధ్వంసం చేశారని, పరికరాలు విరగొట్టారని ఫిర్యాదు చేశారు. కళ్యాణపురి పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, బ్యాంక్ కాలనీ పార్కులో వాచ్‌మెన్ రూమ్, సీసీ కెమెరాలు, చిన్నారుల ఆట పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. హార్టికల్చర్ డిపార్ట్మెంట్ డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ పార్కులలో పనులు చేపట్టేందుకు ప్రతిపాధనలు సిద్ధం చేస్తామని సూచించారు. పెండింగ్ లో ఉన్న పనులు సకాలంలో పూర్తి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కె.జగన్, బాలాజీ ఎన్‌క్లేవ్ అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, వలీ, నార్త్ కళ్యాణపురి అధ్యక్షుడు శివారెడ్డి కళ్యాణపురి కార్యదర్శి వికాస్,బ్యాంకు కాలనీ అధ్యక్షులు గఫూర్, కార్యదర్శి సందీప్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు

## భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం పిఐసి ఛైర్మన్‌గా బంగారి బాబు



సిఎం రేవంత్‌రెడ్డితో బంగారి బాబు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని నాదర్‌గుల్ అదే విధంగా హైదరాబాద్ నగరంలోని సైదాబాద్ దోభీఘాట్ చౌరస్తా కేంద్రాలుగా పని చేస్తున్న భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం నూతన పిఐసి ఛైర్మన్ (పర్సన్ ఇంఛార్జి ఛైర్మన్)గా బంగారి బాబు నియమితులయ్యారు. ఈ మేరకు కో-ఆపరేటివ్ జాయింట్ రిజిస్ట్రార్/రంగారెడ్డి జిల్లా కో-ఆపరేటివ్ ఆఫీసర్ (డిసిఓ) భాగ్యనగర్ సొసైటీకి సంబంధించిన నూతన పిఐసి కమిటీకి సంబంధించిన ఉత్తర్వులను జారీ చేశారు. ఈ ఉత్తర్వులు సోమవారం భాగ్యనగర్ సొసైటీ కార్యాలయానికి అందాయి. డిసిఓ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం బంగారు బాబు సొసైటీ పిఐసి ఛైర్మన్‌గా ఉండగా ఇటీవల వరకు సొసైటీ ఛైర్మన్‌గా, పిఐసి ఛైర్మన్ పని చేసిన మర్రి నర్సింహారెడ్డి పిఐసి మెంబర్‌గా అయ్యారు. ఇక పోతే మిగతా పాలకవర్గ సభ్యుల విషయానికి వస్తే మార్పులేవీ జరగలేదు. పిఐసి మెంబర్లుగా పెత్తుల్ల పుల్లారెడ్డి, తోట ప్రతాప్‌రెడ్డి, కందాడి జ్యోతి, యెల్చల సుదర్శన్‌రెడ్డి, తిరుపతి గిరిరాజ్, పెద్దబావి మోహన్‌రెడ్డి, చప్పిడి కొండల్‌రెడ్డి, చిగిరింత శ్రీరాంరెడ్డిలను కొనసాగిస్తూ ఉత్తర్వులో ప్రకటించారు. మొత్తం 12 మంది పాలకవర్గం గల భాగ్యనగర్ సొసైటీలో డైరెక్టర్లుగా ఉన్న వంక పోచమ్మ, నల్ల నర్సింహులు మృతి చెందడం జరిగింది.

**ప్రభుత్వం మార్పుతో పిఐసి ఛైర్మన్ మార్పు**

భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం చరిత్రలో పర్సన్ ఇంఛార్జి ఛైర్మన్ మార్పు జరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. 2020 ఫిబ్రవరిలో జరిగిన సొసైటీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు చెందిన మర్రి నర్సింహారెడ్డి ఛైర్మన్‌గా ఎన్నిక కాగా కాంగ్రెస్‌కు చెందిన బంగారి బాబు వైస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. అంతకు ముందు అధికారంలో ఉన్న బిజెపి వారు డైరెక్టర్లకే పరిమితమయ్యారు. అయితే ఐదేళ్ళ పదవీ కాలం పూర్తయిన తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు గత ఫిబ్రవరి నుండి అదే పాలక వర్గం పిఐసి కమిటీగా కొనసాగుతున్నది. అప్పటి నుండి ఆరు నెలలు పూర్తి కాగా ఈ సెప్టెంబర్ నెలలో మరో ఆరు నెలల పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో పాటు ఏకంగా పిఐసి ఛైర్మన్‌ను మారుస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. బిఆర్ఎస్ పాలన నుండి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రావడంతో పిఐసి ఛైర్మన్లను మార్చే వీలు ఉంటుందని సహకార సీనియర్ అధికారులు తెలిపారు.

## అంగన్‌వాడి టీచర్ల సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తుతా: సబితా ఇంద్రారెడ్డి



క్యాంప్ ఆఫీస్‌లో సబితా ఇంద్రారెడ్డితో అంగన్‌వాడి టీచర్లు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో అంగన్‌వాడి కేంద్రాలను నిర్వీర్యం చేయడం ప్రభుత్వానికి తగదనీ అంగన్‌వాడి టీచర్ల, సిబ్బంది సమస్యలపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో గళమెత్తుతానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం అంగన్‌వాడి కేంద్రాలకు చెందిన టీచర్లు జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి సబితారెడ్డిని కలిసారు. ఈ సందర్భంగా వారు తమ న్యాయమైన సమస్యలు, డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తీర్చడం లేదని ఆమె దృష్టికి తెచ్చారు. ఈ మేరకు ఆమెకు ఒక వినతి పత్రం సమర్పించి తమకు అండగా ఉండి తమకు న్యాయం జరిపించాలని కోరారు. ఈ సందర్భంగా స్పందించిన సబితారెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల ముందు కాంగ్రెస్ అంగన్‌వాడి టీచర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిందేనని స్పష్టం చేశారు. ఎన్నికల హామీ ల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అసెంబ్లీ లో నిలదీస్తామని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం దిగి వచ్చి హామీలను నెరవేర్చే వరకు పోరాడుతామని పేర్కొన్నారు.

## వర్షాకాలంలో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి : కార్పొరేటర్ రాగుల



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాగుల,అధికారులు.

**వనస్థలిపురం సెప్టెంబర్.15.ప్రభాతవార్త :** వర్షాలు భారీగా కురుస్తున్న సందర్భంగా కాలనీలలో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం డివిజన్ పరిధిలోని నాగార్జున కాలనీ రోడ్ నెంబర్ 2 లో డ్రైనేజీ పొంగిపొర్లుతున్నాయని కాలనీ వాసుల నుండి ఫిర్యాదు రావడంతో సంబంధిత అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు భారీగా కురుస్తున్న సందర్భంగా డ్రైనేజీ పొంగిపొర్లి కాలనీలలో ప్రవహించకుండా,ఎప్పటికప్పుడు డ్రైనేజీ మ్యాన్ హోల్స్ ను శుభ్రం చేస్తుండాలని అధికారుల కు సూచించారు.తగు జాగ్రత్తలు తీసుకుంటూ కాలనీవాసుల కు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.ఎచ్.ఎం. సి.అధికారులు రఫి,రాజగోపాల్ రెడ్డి,జలమండలి అధికారి భవ్య,వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్,కాలనీవాసులు పాల్గొన్నారు.

## క్రాంతిహిల్స్ కాలనీ ఆర్చి నిర్మాణానికి భూమిపూజ



క్రాంతిహిల్స్ కాలనీ ఆర్చి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ రాగుల,కాలనీ ప్రతినిధులు

**వనస్థలిపురం. సెప్టెంబర్.15.ప్రభాతవార్త** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని క్రాంతిహిల్స్ కాలనీ ఆర్చి నిర్మాణానికి సోమవారం స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి,కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధుల తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులలో కాలనీవాసులు భాగస్వామ్యం అయినప్పుడే కాలనీలు అభివృద్ధి చెందుతాయన్నారు.ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బద్దం రాంరెడ్డి,ప్రధానకార్యదర్శి కంచర్ల సత్తిరెడ్డి,వి.మనోహర్, శ్రీనివాస్,నారాయణ,రామంజనేయ రెడ్డి, మల్లేశం,భిక్షపతి,కాలనీవాసులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మానసిక ఆరోగ్యం అవసరం



**నేరేడ్ మెట్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** యువతలో పెరుగుతున్న మానసిక ఆందోళనలకు, ఆత్మహత్యల సమస్యలకు నివారణగా మానసిక ఆరోగ్యం అత్యంత ముఖ్యమని తెలంగాణా సైకాలజిస్ట్ అసోసియేషన్ నాయకులు సూచించారు.నేరెడ్ మెట్ డివిజన్ సైనిక్ పురిలోని భవాన్స్ రామకృష్ణ విద్యాలయంలో సోమవారం నిర్వహించిన మానసిక ఆరోగ్యం ప్రతిభా పాటవం" అవగాహన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రాజ్ ఆచార్య, జిల్లా అధ్యక్షురాలు ఆలియా పర్వీన్ విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక మార్గదర్శకాలు అందించారు. విద్యార్థులు ప్రతిభను పెంపొందించుకోవాలంటే భావోద్వేగ నియంత్రణ, ధైర్యం, ఆత్మవిశ్వాసం అత్యంత అవసరమని పేర్కొన్నారు.రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు నాగవళి మానసిక ప్రశాంతత సాధన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు డా. మోతుకూరి రామచందర్, ఉపాధ్యక్షులు ఏముల సుధాకర్ పాల్గొన్నారు. సమాజంలో పెరుగుతున్న ఆత్మహత్యల సమస్యకు పరిష్కారం చూపే దిశగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మేలుకొల్పుతాయని వారు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొని సైకాలజిస్టుల సూచనలను ఆసక్తిగా విన్నారు. విద్యార్థులు ప్రశ్నలు అడిగి నిపుణుల సమాధానాలు పొందారు. జిల్లా వ్యాప్తంగా మానసిక ఆరోగ్యము పై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరంగా నిర్వహిస్తామని అసోసియేషన్ నేతలు స్పష్టం చేశారు.

## కుమ్మరికుంట సుందరీకరణకు చర్యలు తీసుకుంటాం



గుర్రపు డెక్క తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్.

**హయత్ నగర్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. బతుకమ్మలను నిమజ్జనం కోసం హయత్ నగర్ కుమ్మరి కుంటలోని గుర్రప్ప డెక్కను సంబంధిత అధికారులతో కలిసి నీటి కలుపు తీయు యంత్రాంగం సహాయంతో సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.... తెలంగాణలో మహిళలకు బతుకమ్మ ప్రత్యేకమని... మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కుమ్మరి కుంట వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా శానిటేషన్ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాల ని తెలిపారు.కార్యక్రమంలో సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవ రెడ్డి, ఎంటమాలజీ ఎఈ రవీందర్ రెడ్డి, సూపర్వైజర్ కుమార్, నాయకులు గంగాని శ్రీనివాస్, సత్యనారాయణ, పార్వతి పాల్గొన్నారు.

## సుబ్రమణ్యంనగర్‌లో జిహెచ్ఎంసి అధికారుల పర్యటన



కాలనీవాసులతో మాట్లాడుతున్న అధికారులు

**ఎల్బినగర్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ సుబ్రమణ్యం నగర్‌లో నూతన సిసి రోడ్లు, బాక్స్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టడానికి సోమవారం జిహెచ్ఎంసి అధికారులు కాలనీలో పర్యటించారు.పనులు చేపట్టాల్సిన ప్రాంతాలను వారు పరిశీలించారు.కార్యక్రమంలో డిఇ దేవేందర్, ఎఇ శిరీష, స్థానికులు శ్రీనివాస్ గౌడ్, సత్య మూర్తి, ప్రసాదరావు, రాజేష్ రెడ్డి, రమేష్, చక్రపాణి పాల్గొన్నారు.

## దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తాం: కార్పొరేటర్



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందిస్తున్న పీఅండ్ టీ కాలనీవాసులు

**హయత్ నగర్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** పీ అండ్ టీ కాలనీలో పార్కు అభివృద్ధికి చర్యలు తీకుంటామని, ఒకటి రెండు రోజుల్లో వీధి దీపాల సమస్యను పరిష్కరిస్తామని హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. సోమవారం కాలనీలో పర్యటించిన ఆయన కాలనీ వాసుల సమస్యలను తెలుసుకుని దశలవారిగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అనంతరం సిద్ధి వినాయక కాలనీలో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. రోడ్ల పనుల్లో నాణ్య తను పాటించాలని కాంట్రాక్టర్ కు సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పూర్ణయ్య, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి



కార్మికులకు రిక్షలు పంపిణీ చేస్తున్న చింతల అరుణా సురేందర్ యాదవ్

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** పరిసరాల పరిశుభ్రత విషయంలో కాలనీ ప్రజలు సహకరించాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. నాగోల్ డివిజన్ పరిధిలో నూతన తోపుడు చెత్త బండ్లను హయాత్ నగర్ డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ, డిఈ నీలిమతో కలిసి జిహెచ్ఎంసి కార్మికులకు కార్పొరేటర్ అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మీ ఇంటి ముందుకు వచ్చే తోపుడు చెత్త బండ్లలోనే చెత్తను వేయాలన్నారు. రోడ్లపై చెత్త వేయడం పూర్తిగా నిషేధమని, ఎవరైనా రోడ్లపై చెత్త వేస్తే వారిపై కేసులు నమోదు చేసి ఎనిమిది రోజుల జైలు శిక్ష విధించబ డుతుందని స్పష్టం చేశారు. నాగోల్ డివిజన్ శుభ్రంగా, పర్యావరణ హితంగా ఉండేందుకు ప్రతిఒక్కరు సహకరించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న శుభ్ర హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం కావాలన్నారు.

## హైడ్రా పనితీరు సరిగా లేదు:పవన్

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** హైడ్రా పనితీరు సరిగా లేదని ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో వారు ముందుకు రావడంలేదని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ అన్నారు. కొత్తపేట డివిజన్ శివగంగ కాలనీ, భరత్ నగర్ కాలనీలలో సోమవారం కార్పొరేటర్ పర్యటించి డ్రైనేజీ లీకేజీలు, వర్షం కారణంగా ముంపునకు గురవుతున్న లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. డ్రెయినేజీ లైన్లు ఉప్పొంగి మురుగునీరు రోడ్ల మీదకి రావడం, వర్షపునీరు నిల్వవడం వల్ల రహదారులు పాడై ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నట్లు స్థానికులు కార్పొరేటరుకు వివరించారు. అందుకు స్పందించిన కార్పొరేటర్‌వెంటనే ఏఈ షరీఫ్, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లును పిలిపించి డ్రెయినేజీ పైపులైన్ శుభ్రపరచడం, దెబ్బతిన్న సీవరేజ్ లైన్లను మరమ్మత్తులు చేయడం, వర్షపు నీరు వెళ్లే కాలువలను శుభ్రపరచడం, రహదారులపై నిల్వ ఉన్న మురుగు నీరు, చెత్త తొలగించడం వంటి తక్షణ చర్యలను తీసుకోవాలని సూచించారు. హైడ్రా అధికారులు, సిబ్బంది పనితీరు సరిగా లేదని వర్షం పడే సమయంలో హైడ్రా సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహిస్తలేరని కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో కాలనీ అధ్యక్షులు లక్ష్మీపతి గౌడ్, సుబ్బారావు, మల్లేష్ గౌడ్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, బిజెపి నాయకులు కొత్త తిరుమల్, మధు గౌడ్, పవన్, శరన్ పాల్గొన్నారు.

## రూ.కోటి వ్యయంతో అభివృద్ధి పనులు : రజితరెడ్డి



**ఉప్పల్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ పరిధిలో రూ.కోటి వ్యయంతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప్పల్ హిల్స్‌లో రూ.93లక్షలతో సిసి రోడ్డు, రూ.7లక్షల వ్యయంతో డ్రైనేజీ పనులు ఎఇ రాజ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ హిల్స్‌లో ప్రధాన రహదారి నుంచి హనుమాన్ దేవాలయం వరకు రూ.65 లక్షలతో స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణం పనులు చేపడుతామని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీలో పెండింగ్‌లో ఉన్న పనులు పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఇ రాజ్‌కుమార్, కాలనీ నేతలు దుర్గం నవీన్ యాదవ్,గోవింద్ కుమార్, స్వామి,ఈగ ఆంజయ్య, నల్ల ప్రభాకర్‌రెడ్డి, పి.రామచందర్,ఎం.సుధాకర్ రెడ్డి, టి.విజయ సింగ్, ఈ.మహేందర్, టి.శ్రీనివాస్ రెడ్డి, ఎ.రవి, జి.కొమురయ్య, వెంకటేష్ గౌడ్, ఎ.బిక్షపతి,రాజు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థులకు పక్కా భవనాలు నిర్మించాలి

### సలహాదారులు నల్లారాధాకృష్ణ



మాట్లాడు తున్న నల్ల రాధా కృష్ణ

**నాచారం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** గురుకుల విద్యాలయాలకు స్వంత బిల్డింగులను ఏర్పాటు చేయాలని గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక సలహాదారులు నల్లారాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాచారంలోని బిఎస్‌పి కార్యాలయంలో గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ సంస్థను ఏర్పాటు చేశారు. కనుకంట్ల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నల్లరాధాకృష్ణ హైజరై మాట్లాడుతూ విద్యార్థులకు నాన్యమైన విధ్య, పౌస్టికాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురుకుల విద్యావ్యవస్థకు అడ్డంకిగా మారిన జీవో నెం.17ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరెపాగు ప్రమోద్ మహరాజ్, కొమ్మగళ్ల వెంకటేశ్వర్లు, బూడిద గనేష్ గౌడ్, మారపాకుల శేఖర్ రెడ్డితో పాటు గురుకుల పేరెంట్స్ అన్నం రాజు హరిబాబు, నారారం సునిత, బోనాల బాబు, ఎదునూరి రాజు, ఎల్లయ్య, శ్రీనివాస్, నరెందర్,భిక్షపతి,కెలోత్ సీతారాం నాయక్, వెంకటయ్య తధితరులు పాల్గొన్నారు.